
# కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



ఫిబ్రవరి 2011

# కొత్తపల్లి తెలుగు పిల్లల ఈ మాసపత్రిక- ఫిబ్రవరి 2011 సంచిక

**మూలం: http://kottapalli.in**

సంపాదకులు: **నారాయణ**

ముఖచిత్రం**: వీరాంజనేయులు**

ముద్రిత ప్రతి వెల:

**ప్రతి ఒక్కొంటికి రూ. 20/-**

**పన్నెండు భాగాల ప్రత్యేక వెల: రూ. 240/-**

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ అంతట మీరే ముద్రించుకోవచ్చు!



కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

**ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in**




# విషయ సూచిక



# సమస్య- సమాధానం

అనగా అనగా కోతిపిల్ల ఒకటి ఉండేది.

చక్కగా పళ్ళు ఇకిలించి నవ్వుతూ ఉండేదది.

పళ్ళతో పళ్ళనూ, కాయలనూ కరకర నమిలి తినేస్తూ సంతోషంగా ఉండేది.

ఒకరోజున అది దానిమ్మకాయను ఒకదాన్ని కొరికింది. పెళుసైన దానిమ్మతొక్కు కొంచెం విరిగి, దాని పళ్ళ సందుల్లో ఇరుక్కుపోయింది.

అది నోట్లో వేళ్ళు పెట్టి పీకినా, పుల్ల పెట్టుకొని శ్రమపడినా ఆ తొక్కు మాత్రం ఊడి రావట్లేదు. నాలుకను ఎటు త్రిప్పినా చివరికి దానిమ్మ తొక్కే తగుల్తోంది.

కోతిపిల్లకు చాలా గందరగోళంగా అనిపించింది. దాని కాలు ఇప్పుడు ఒక చోట నిలవటం లేదు. అది ఎగిరింది; దూకింది; ఇకిలించింది; పళ్ళు నూరింది; నవ్వింది; ఏడ్చింది- ఏం చేసినా ఊహుఁ- ప్రయోజనం

లేదు.

"పంట్లోదూరిన దానిమ్మ తొక్కు ఉబ్బి, వేర్లు బయటికొచ్చి, చివరికి ఆ వేర్లతో నోరంతా నిండిపోతుంది- ఇంక అసలు నోరు తెరిచేందుకు వీలుండదు; మూసేందుకు వీలుండదు" అనిపించింది దానికి. 'నోరు తెరిస్తే దానిమ్మ వేర్లు ఎక్కడ నోట్లోంచి బయటికి వచ్చేస్తాయో' అన్నట్లు, అది ఇక నోరు తెరవకుండా మూసుకొనే ఉండిపోయింది. నాలుకతో దానిమ్మ తొక్కును నెట్టీ నెట్టీ అలిసిపోయిందది- కానీ దానిమ్మ తొక్కు మాత్రం కొంచెం కూడా కదల్లేదు.

కొంచెం సేపు కష్టపడ్డాక, ఇంక లాభం లేదని, అది వడ్రంగి పిట్ట దగ్గరికి వెళ్ళింది- "ప్లీజ్! నా నోట్లోంచి దానిమ్మ తొక్కును పీకెయ్యవా? నీ ముక్కు పొడిచేందుకు, పురుగుల్ని పట్టుకునేందుకు చాలా అనువుగా ఉంటుంది కదా, ప్లీజ్!" అన్నది.

వడ్రంగిపిట్ట దాన్ని నోరు తెరవమని, తన ముక్కుతో దానిమ్మ తొక్కును పొడిచి, లాగేసేందుకు ప్రయత్నించింది. కానీ అది చినిగి ముక్కలైంది తప్పిస్తే, పూర్తిగా బయటికి రాలేదు. చివరికి అది రెక్కలెత్తేసింది- "నావల్ల కాదు బాబూ" అనేసింది. "దానిమ్మ తొక్కేగా! రేపో మాపో దానంతట అదే పోతుందిలే" అన్నది.

"రెండు రోజులా! నోరును ఇట్లా పెట్టుకొని రెండురోజులు ఎట్లా బ్రతికేది?" అని ఏడ్చింది కోతిపిల్ల. ఏడ్చీ ఏడ్చీ దాని చెంపల మీద కన్నీళ్ళు చారికలు కట్టాయి. కానీ దానిమ్మ తొక్కు మాత్రం నాలుకకు తగుల్తూనే ఉంది.

ఆరోజంతా అది ఇక ఆడుకోలేదు; గెంతలేదు; దూకలేదు; చెట్ల కొమ్మలు పట్టుకొని ఊగలేదు; ఏమీ తినలేదు; దానికసలు ఆకలే వేయలేదు ఆరోజు.

సాయంత్రం అది ఇంటికి చేరుకునేసరికి, వాళ్ల తాత దాన్ని పిలిచింది ఉత్సాహంగా. తను ఎత్తుకొచ్చిన అరటిపళ్ళ గెల చూపించింది దానికి. నాలుగైదు అరటిపళ్ళూ తెచ్చి చేతిలో పెట్టింది కూడా. కోతిపిల్లకు మామూలుగా అరటిపళ్లంటే ప్రాణం. కానీ ఇప్పుడు దానికి అవి ఏమాత్రం సంతోషాన్నివ్వలేదు. "నాకొద్దు! నేను తినలేను! నా పళ్ళసందుల్లో దానిమ్మ చెక్కు ఇరుక్కున్నది!" అని కోపంగా అరిచింది అది. "ఫరవాలేదులే, తిను! అరటిపళ్ళు బాగుంటై!" అన్నది తాతకోతి. అయితే తాత చెప్పిన కొద్దీ కోతిపిల్ల మరింత చెట్టెక్కి కూర్చున్నది. "దానిమ్మ తొక్కు పోతేనే, నేను ఏమైనా తినేది!" అని భీష్మించుకు

కూర్చున్నది.

చివరికి తాతకోతి, తనే ఒక్కో పండును తినటం మొదలు పెట్టేసరికి, కోతిపిల్ల అయిష్టంగానే దాని దగ్గరికెళ్ళి కూర్చున్నది. మెల్లగా ఒక పండును తీసుకొని తిన్నది- బాగుందని, ఇంకోటి తిన్నది- ఆపైన మరొకటి- ఇక తింటూ పోయింది-


కొంచెం సేపటికి చూస్తే, దాని పళ్ల సందుల్లో దానిమ్మ తొక్కు లేదు! ఎప్పుడు పోయిందో, ఏమో, మరి!

మనల్ని పట్టి పీడించే సమస్యలు అనేకం, నిజానికి చిన్నవే- అయితే వాటిని పోగొట్టుకునేందుకు మనం ఎంత శ్రమ పడతామంటే, ఆ అలసటలో మనకు చాలా ఇష్టమైనవికూడా నిస్సారంగా తోస్తాయి. అలాంటప్పుడు ఊరికే అధైర్యపడి కూర్చోకుండా, తెలిసినవాళ్ళు చెప్పిన మంచిపనుల్లో దేన్నో ఒకదాన్ని, కొంచెం కొంచెంగా చేస్తూ పోవాలి. మెల్లగా ఆ సమస్యలూ సర్దుకుంటాయి; సంతోషమూ మన సొంతం అవుతుంది! ఏమంటారు?

మీకందరికీ చాలా అభినందనల అరటిపళ్ళు!

కొత్తపల్లి బృందం.





# నీతిచంద్రిక

16 వ భాగం

*మూలం: కీ.శే.పరవస్తు చిన్నయసూరి సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

*జరిగిన కథ: సంజీవకుడిని మంత్రిగా చేసుకొన్నాక సింహరాజు ఇతరులందరికీ దూరమైంది. సంజీవకుడి అదృష్టాన్ని చూసి దమన కుడికి కన్నుకుట్టింది. అది కరటకుడి దగ్గరకు వెళ్ళి 'కాకి-పాము' కథను, అందులో భాగంగానే 'కొంగ-ఎండ్రి' కథను చెప్పింది. అటుపైన 'ఉపాయంతోదేన్నైనా సాధించవచ్చు' అని చెబుతూ, అది 'సింహం-కుందేలు' కథను చెప్పసాగింది. కుందేలు ఆలస్యంగా వెళ్ళినందుకు సింహానికి కోపం వచ్చి చర్రున లేచి నిల్చున్నది- ఇక చదవండి, నీతిచంద్రిక16 వ భాగం...*

అప్పుడు కుందేలు వినయంగా తలవంచి- "ప్రభూ! అడవిలోని జంతువులందరూ మీవారే తప్ప, వేరు కాదు. అలాంటి మీ సేవకుల తప్పు ఇందులో వెంట్రుకవాసంతైనా లేదు. నేను ఈరోజు ఉదయాన్నే మావాళ్ళ శాసనానికి తలఒగ్గి, తమ దగ్గరికి వద్దామని త్వర త్వరగా బయలుదేరాను. ఇంకా దారి మధ్యలో ఉండగానే నాకొక సింహం ఎదురైంది!

అది నన్ను చూసి- "ఒసీ! కుందేలు కూనా! నాముందు ఎంతలేసి జంతువూ భయంతో వణికిపోవలసిందే- నన్ను చూసికూడా నిర్భయంగా పోగలిగే జంతువు ఒక్కటీ ఈనాటివరకూ నా కంట

పడలేదు. నీ గర్వం చూస్తే నాకు విపరీతమైన కంపరం పుడుతున్నది. నీకు ఎదురుగా నిలుచున్న నన్ను లక్ష్యపెట్టకుండా, నన్నే రాసుకొని పోయేంత పొగరు నీకు ఎట్లా వచ్చింది? నిలు, నిలు! ఎక్కడికి పోతావు!?" అని గర్జిస్తూ నిలువరించింది.

నేను ఆ సింహాన్ని చూసి, ఏమాత్రం భయపడకనే, "మమ్మల్ని అందరినీ కాపాడేవాడు, చిన్నప్రాణుల పట్ల దయగలవాడు అయిన సింహరాజు ఉన్నాడు. ఆ మహామహుని సన్నిధికి పోతున్నాను. నన్ను ఆపకు- ఆ రాజుకు కొంచెం కోపం వచ్చిందంటే చాలు- లోకం అంతా అతలా కుతలం అయిపోతుంది!" అన్నాను.

అప్పుడు ఆ సింహానికి చాలా కోపం వచ్చేసింది- మిట్టమధ్యాహ్నం వేళ ప్రకాశిస్తున్న సూర్యబింబం మాదిరిగా మండుతూ- అది "అహహా! ఇంత కాలానికి గానీ ఇట్లాంటి వింత మాట వినబడలేదే! ఈ అడవిలోని జంతు సమూహాలన్నిటికీ నేనొక్కడినే ప్రభువును- మరి నాకు ప్రభువు ఎవ్వరబ్బా?! ఎవరైనా ఒళ్ళుమరచి, అందని ఆ పదవికోసం గంతులు వేసేందుకు సిద్ధపడితే నేను వాళ్ళను 'నా బలం' అనే అగ్నికి ఆహుతి చేస్తాను. నువ్వు ఇంతకుముందు ఎవరో నీ ప్రభువన్నావే, వాడిని చూపెట్టు- ఇప్పుడే వాడి మీద యుద్ధానికి పోతాను. వాడిని చూపకపోతే నిన్నే తినేస్తాను" అని బెదిరించింది.

"దాని బారి నుండి తప్పించుకునే మార్గం లేక, నేను చివరికి దానితో "సరేలెండి! అట్లాగే వెంట బెట్టుకొని వస్తాను" అని నమ్మబలికి, చివరికి మీ దగ్గరికి రాగలిగాను- అందుకే ఇంత ఆలస్యం అయింది" అన్నది.



కుందేలు మాటలు విన్న ఆ సింహరాజుకు అంతులేని కోపం వచ్చింది. "తక్షణమే ఆ దుష్ట జంతువును చూపెట్టు. దాన్ని యమపురికి సాగనంపనిదే ఊరుకోను. నాకు దారి చూపిస్తూ ముందు నడువు" అని ఆజ్ఞాపించింది. కుందేలు వినయం, ఆశ్చర్యం కలగలసినట్లు ముఖం పెట్టి "సరే, సరే, రండి-ఇటు రండి" అని వేగంగా ముందు నడుస్తూ దాన్ని తీసుకు పోయింది. దూరంగా ఉన్న ఒక బావి దగ్గరికి ఆ సింహాన్ని తీసుకొని పోయి, "ఓ జంతు కుల సార్వభౌమా! నీ శత్రువు ఇదిగో, ఈ బావిలో ఉన్నాడు- తొంగిచూడు" అన్నదది.



సింహం బావిలోకి తొంగిచూసింది. బావిలోని నీళ్ళలో దానికి తన ప్రతిబింబమే దర్శనమిచ్చింది. ఆ ప్రతిబింబాన్ని వేరే సింహం అనుకున్నదది! పెచ్చుమీరిన కోపంతో తొట్రుపడుతూ అది దిక్కులు ప్రతిధ్వనించేట్లు భయంకరంగా గర్జించి, ఇక ఆగలేక, 'గుభిల్లు'మని బావిలోకి దూకి దుర్మరణం పాలైంది. కాబట్టి ఎంతటి బలవంతుడినైనా బుద్ధిబలంతో గెలువవచ్చు అని ముగించింది.

**పింగళకుడికి సంజీవకుడిపై అనుమానం పుట్టించటం:**

అట్లా తన అన్నకు 'సింహం కుందేలు' కథ చెప్పి అది, "కాటకము, పాటకము అనే రెండు నక్కలు గతంలో పింగళకుడిని సేవించుకుంటూ ఉండేవి. తప్పు పనులు చేసిన కారణంగా వాటిని రాజుగారు వెళ్ళగొట్టారు. ఇప్పుడు అవి మళ్ళీ రాజానుగ్రహం పొందటంకోసం సంజీవకుడి వెంట తిరుగుతున్నాయి. నా ప్రయత్నానికి ఇదేదో అనుకూలంగా తోస్తున్నది. ఇక సెలవియ్యి- పోయి వస్తాను" అన్నది.

అప్పుడు కరటకుడు "చెట్టు వేరులో చేరిన పురుగును తెలివి తేటలతో బయటికి రప్పించి, వేరుకు దెబ్బతగలకుండా నాశనం చేయటమే నేర్పరితనం. నీకు తెలీనిదేమున్నది? నీ పని నెరవేరుతుంది వెంటనే పోయిరా!" అని దాన్ని సాగనంపింది.

అప్పుడు దమనకం పింగళకుడి దగ్గరికి పోయి, ముఖం వ్రేలాడవేసుకొని, ఏడుపు తెచ్చుకొని నిలబడ్డది. కొద్ది సేపటికి పింగళకుడు దాన్ని చూసి- "దమనకా! ఎందుకు, ఇట్లా స్తబ్ధంగా నిల్చున్నావు? మాకు అతి సన్నిహితుడివి నువ్వు. 'ఈ లోకంలో బ్రతికి ఉందాం' అనుకునే వాడెవ్వడూ నీకు కీడు తలపెట్టేంత సాహసం చెయ్యడు. నీ దు:ఖానికి కారణం తెలిసేంతవరకు మా మనసుకు విచారం కలుగుతుంటుంది. అందుకని, సందేహించక చెప్పు" అన్నది.

అప్పుడు దమనకుడు దానితో "ప్రభూ! తెలివి తక్కువై ఘోరమైన తప్పు ఒకటి చేశాను. నన్ను కరుణించి, క్షమించండి. సేవకుడు తను చేసిన తప్పుల్ని యజమానితో చెప్పకుండా దాచి మోసగించకూడదు. అట్లా మోసం చేసినవాడు అటూ ఇటూ కాకుండా పోతాడు. అది అట్లా

ఉండనివ్వండి- అనేకమంది సుఖంగా బ్రతికేందుకు ఆధారమైన పుణ్య పురుషుడికి ఏమైనా కీడు జరిగితే అది ఆలోచించవలసిన సంగతి కాని, మా వంటి అల్పప్రాణి ఒకదానికి కష్టం వచ్చినా సమస్య లేదు. దానివల్ల ఆకాశం ఏమీ కూలిపోదు. ప్రభువులవారి ఎదురుగా నిలబడిన సేవకుల ప్రవర్తన ఎల్లప్పుడూ అద్భుతంగానే ఉంటుంది- అందువల్ల, ప్రభువన్నవాడు గూఢచారులను నియోగించి, తన సేవకులు తనచాటున ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు అన్నది తెలుసుకుంటూ, ఆ నివేదికల ఆధారంగా మిత్రులను, శత్రువులను వేరుపరచి, వారిపట్ల కృపను, లేదా వైరాన్నీ ప్రదర్శిస్తూ 'ప్రజలు అనే వృక్షానికి తల్లివేరు' అయిన తనను ఎల్లప్పుడూ కాపాడుకోవాలి.

ప్రభూ! సేవకుడు ఏదేదో చెబుతున్నాడని ఉపేక్షించక, వినండి- సంజీవకుడి ప్రవర్తన, చూస్తే, ఇదివరకటిలాగా లేదు. అన్యాయంగా మాట్లాడకూడదు- మొదట్లో సంజీవకుడి ప్రవర్తన అనన్య సామాన్యంగా ఉండేది. అతని మంచితనాన్ని చూసి మేమందరం చాలా ఆశ్చర్యపడేవాళ్ళం. ఆ రోజుల్లో ఇతడు మిమ్మల్ని కల్మషం లేని ప్రేమ భావంతో గొలిచేవాడు. ఆకలి దప్పులనిగాని, నిద్ర అని గాని చూడక, ఎల్ల వేళలా మీ సేవలోనే మునిగి ఉండేవాడు. చక్కెరను తిని చేదు అనకూడదు- ఆనాటి ప్రవర్తనను బట్టి చూస్తే, 'సంజీవకుడు అసలు ఈ లోకపువాడు కాడేమో' అనిపిస్తుంది. మరి ఏ కాలదోషమో గాని, 'ఆనాటి సంజీవకుడు ఈనాటి సంజీవకుడు కాదు' అనిపిస్తున్నది.



ఆ రోజుల్లో ఇతను మీ మంచితనాన్ని వేనోళ్ళ కొనియాడుతూ ఉండేవాడు. ఆ సమయంలో అతనిలో కనబడే సంపూర్ణ ఆనంద పరవశత్వానికి హద్దులు ఉండేవికావు. రాను రాను మాలాంటి వాళ్ళం ఎవరమైనా మిమ్మల్ని మెచ్చుకుంటే "నిజం, నిజం- ఔను, ఔను" అని పాడిపాడి మాటలతోటే చాలిస్తూ వచ్చాడు. ఆ తర్వాత దేవరవారి గొప్పతనాన్ని చిరునవ్వుతో వినటమేగాని, "అవునని-కాదని" అనటం కూడా కరువైంది. ఈమధ్యకాలంలో- మరి ఏమి కథో గాని, ప్రభువుల ప్రస్తావన వచ్చినప్పుడు అతనిలో తెచ్చిపెట్టుకున్న సంతోషమే తప్ప, నిజమైన చిరునవ్వు చివురంతైనా కనబడటంలేదు.

ఈమధ్య ఇతని అభిప్రాయాలను తెలిపే ముఖకవళికలు కొంచెం వింతగా కనబడుతున్నై. 'దీనికి కారణం ఏమిటా' అని నా మనస్సులోనే ఏడ్చుకుంటూ ఉన్నాను. ఈరోజున నా మిత్రులు కొందరు మాటల సందర్భంలో "ప్రభువుచేత వెళ్ళగొట్టబడిన కొందరితో సంజీవకుడు స్నేహం నెరపుతున్నాడు- కాటక పాటకులతో అతను నిత్యమూ ఏవేవో మంతనాలు ఆడుతున్నాడు" అని చెప్పారు. దాన్నిబట్టి ఇతని ప్రవర్తనలో మార్పును అర్థం చేసుకోగలిగాను. ప్రభువు మేలుకోరేవాడు కలలోనైనా స్వామిద్రోహులతో నేస్తం నెఱపేందుకు పూనుకుంటాడా?" అని చెప్పి, అటూ ఇటూ కలయచూసి, చేతితో నోరు మూసుకొని, ప్రభువుల చెవికి దగ్గరగా తన నోటిని చేర్చేందుకై మోర సారించి, గుసగుసగా "ఇది తమరి సన్నిధిలో ఉన్న సేవకులకు అందరికీ తెలిసిపోయి ఉండవచ్చు- సంజీవకుడంటే ఉన్న భయం కొద్దీ ఇక్కడివాళ్ళు బయటపడకుండా ఉన్నట్లున్నారు. ఇంత ఎందుకు? ఏ ఒక్కడిని పిలిచి విచారించినా కథంతా తమరి చిత్తానికి అర్థమైపోగలదు" అని ఊదింది.

అది విని పింగళకునిలో అపారమైన రోషం, విషాదం పెల్లుబికినై. అతను సేవకుడొకడిని పిలిచి "ఇదిగో నిజం చెపు- ఇక్కడ పనిచేసేవాళ్ళలో ఎవరైనా కాటక పాటకులతో స్నేహంగా ఉంటున్నారా?" అని అడిగాడు. వాడు భయంతో కంపిస్తూ గుటకలు మ్రింగగా, పింగళకుడు- "భయపడకు, నిజం చెప్పు. నీ ప్రాణానికేమీ అవ్వదు" అని మాట ఇచ్చాడు. దాంతో నోటివెంట మాట పెగిలి, వాడు "అయ్యా! సంజీవకుడు వారి చేరికకు అంగీకరించినట్లు కనబడుతున్నది" అని చెప్పేశాడు. అప్పుడు ప్రభువు "సరే, మేము నిన్ను ఇట్లా అడిగామన్న సంగతిని ఇక్కడే మర్చిపో. బయట ప్రాక్కనివ్వకు. ఇక పో!" అని వాడిని పంపించి, ఏమి చేయాలో తెలియని వాడిలాగా దు:ఖితుడై, నేలవైపుకు చూస్తూ కూర్చున్నాడు.



వెంటనే దమనకుడు ఇట్లా అన్నాడు- " దీన్ని బట్టి చూస్తే మనతో సంజీవకుడు సన్నిహితంగా వర్తించే అవకాశం ఇక లేదనే తోస్తున్నది. మనం అతని గురించి కొంత తెలుసుకున్నాం, కనుక ఇకమీద మన మనసుకు కూడా గతంలో లాగా

అతని పట్ల దగ్గరితనం ఉండదు. అయినప్పటికీ ఇతను చాలాకాలంగా ప్రభువుల ఆస్థానంలో ఉండి, మనసుకు దగ్గరైనవాడు. చిరకాలంగా సేవిస్తున్న అనుచరుడు తెలిసీ-తెలియక ఏవైనా అపరాధాలు చేస్తే క్షమించాలిగాని, బయటివాళ్ళలాగా వాడిని వెళ్లగొట్టటం ధర్మం కాదు. కాబట్టి, ఇతడు ఇంతవరకు చేసిన తప్పుడు పనులను బయటపెట్టి, భయం పుట్టించి, క్షమాపణ కోరేటట్లు చేసి, 'ఇకమీద ఎన్నడూ ఇట్లాంటి పని చేయకు' అని కఠినాతి కఠినంగా చెప్పి, ఎప్పటిలాగానే అతని సేవలను అంగీకరించటం అన్ని విధాలుగా మంచిది' అని తోస్తున్నది" అని.

అది విని, మృగరాజు తల ఎత్తి, దమనకుడి ముఖం మీద చూపులు నిలిపి, కొంచెం సేపు ఆలోచించి- "రాజద్రోహులకు ఎంత శిక్ష విధించినా చాలదు. అయినప్పటికీ చాలా కాలంగా నన్ను సేవించిన అటువంటి వాడి పట్ల నా మనస్సు మెత్తనై, తెగింపుకు సమ్మతించటంలేదు. కాబట్టి వాడిని వెళ్ళగొట్టేద్దాము.. నువ్వు చెప్పినట్లే చేసేద్దాం.." అన్నాడు.

అప్పుడు ఆ నక్కల రాజు- "ఇది ఇప్పటికి తోచిన మార్గం. అయినప్పటికీ , 'సహసా విధధీత న క్రియాా' అని సామెత- అంటే 'తొందరపడి ఏ పనినీ చేయకూడదు'- అందువల్ల ఈ విషయాన్నంతా వేరొక బుద్ధికుశలురు ఎవరితోనైనా- తమ మనస్సుకు నచ్చినవారితో- విచారించి చూద్దాం. ఆపైన తమకు ఏది సరైనదిగా తోస్తే అది చేయవచ్చు. బాగా ఆలోచించి చేస్తే ఏ తప్పూ జరగదు. ఆలోగా జరిగే నష్టమూ ఏదీ లేదు గదా" అన్నది.

అది విని సింహరాజు 'ఇక్కడున్నవాళ్ళంతా నీకు తెలిసినవాళ్ళే. వాళ్ల వాళ్ల తెలివితేటలు ఎంతటివో నీకు తెలియనిది కాదు. నీ మనస్సుకు తోచినవాళ్ళెవరో చెప్పు" అన్నది.

అప్పుడు దమనకుడు కొంచెంసేపు కనుఱెప్పలార్పకుండా పైకి చూసి, మళ్ళీ మృగరాజును చూసి, "మా అన్న కరటకుడు వివేకవంతుడు; ప్రభువులవారి హితం కోరేవాడు. ఈ పనికి అతడే 'సరైనవాడు' అని నా మనస్సుకు తోస్తున్నది. తమరి ఆజ్ఞ అయితే అతనిని నేను ఇప్పుడే ఇక్కడికి రప్పిస్తాను" అని చెప్పి, ఒప్పించి, ఒక రాజభటుని పంపి కరటకుడిని అక్కడికి పిలిపించింది. (మిగతాది మళ్ళీ....)



# అందమైన లోకం

*పిల్లలకు అద్భుతాలంటే చాలా ఇష్టం. కానీ ఏం చేస్తాం, అవన్నీ కథల్లోనే జరగాలి తప్ప, నిజంగా జరగవు. అయినా పిల్లలు వాటిని రాయకుండా ఉండనూలేరు; పెద్దలు మెచ్చుకోకుండా ఉండనూ లేరు! ఉదాహరణకు, ఈ కథనే చూడండి- ఎంత అబద్ధం, అదే సమయంలో ఎంత అద్భుతం!*


*రచన: పి.వాణి, 8 వతరగతి, పాలపిట్ట బాలల సంఘం, చెన్నేకొత్తపల్లి.*

అనగనగా ఒక గ్రామం. ఆ గ్రామం పేరు సిరిపురం. ఆ గ్రామంలో కొండయ్య దంపతులు నివసించేవారు. వాళ్లకు ముగ్గురు కొడుకులు. కొండయ్య ముసలివాడైనాక, మరణించబోతూ, తను సంపాదించిన ఆస్తినంతా పెద్దకొడుకులిద్దరికీ రాసి ఇచ్చాడు. మూడవ కొడుకుకు మాత్రం ఒక్క కుంటి గుర్రాన్ని రాసిచ్చాడు.

మూడవ కొడుకు పేరు విజయ్. విజయ్ తన వాటాకు కుంటి గుర్రం మాత్రమే వచ్చిందని ఏమీ బాధ పడలేదు. అన్నలిద్దరికీ తండ్రి ఆస్తిని ఇచ్చేసి, తన కుంటి గుర్రం మీద ఎక్కి వెళ్ళిపోయాడు. పోతూ పోతూ ఉంటే అడవి మధ్యలో ఒక గుహ కనబడింది. విజయ్ కిందకు దిగి, గుర్రాన్ని అక్కడ కట్టి లోపలికి వెళ్లాడు.

అక్కడ ఒక బామ్మ దారం చుడుతూ ఉన్నది. ఆమె తిప్పే చక్రానికి పన్నెండు చువ్వలున్నాయి. ఆమె చుట్టూ తొమ్మిదిమంది పిల్లలు తిరుగుతూ ఆడుకుంటున్నారు. విజయ్

ఆ బామ్మకు మర్యాదగా నమస్కరించి 'నేను ఇక్కడ ఉండచ్చా' అని అడిగాడు. 'నువ్వు చాలా మంచి పిల్లవాడివి నాయనా! ఎంత కాలమైనా ఇక్కడ ఉండచ్చు!" అన్నది ఆ అవ్వ. దాంతో విజయ్ అక్కడే ఉండిపోయాడు. అక్కడున్న పిల్లలను సాకుతూ, అవ్వనీ, గుర్రాన్నీ జాగ్రత్తగా చూసుకుంటూ జీవించాడు. అలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఆలోగా కుంటి గుర్రంకూడా బలంగా, ఆరోగ్యంగా తయారైంది- కానీ దాని కాలు మాత్రం బాగు కాలేదు.



రెండు సంవత్సరాలు నిండాక, బామ్మ విజయ్‌ని పిలిచి, "ఇప్పుడు నువ్వు బయటికి వెళ్ళాల్సిన సమయం వచ్చింది- లోకం నీకోసం ఎదురు చూస్తోంది- వెళ్ళిరా" అని, విజయ్ కి రెండు కాసుల బంగారు నాణాలు ఇచ్చింది. విజయ్ వాటిని తీసుకొని గుర్రం ఎక్కి వెళ్ళాడు. పోతూ ఉంటే అతనికి ఒక బిచ్చగాడు ఎదురయ్యాడు: "బాబూ! రెండు రోజులనుండి ఏమీ తినలేదు. నీదగ్గర తినేందుకు ఏమైనా ఉంటే ఇవ్వు" అన్నాడు అతను విజయ్‌తో.

"అయ్యో, నాదగ్గర తినేందుకు ఏమీ లేవు తాతా, రెండు కాసులు మాత్రం ఉన్నై, తీసుకో- ఇవి నీకేమైనా ఉపయోగపడతాయేమో చూడు"అని విజయ్ తన దగ్గర ఉన్న రెండు కాసులనూ ఇచ్చేశాడు బిచ్చగాడికి.

బిచ్చగాడు నవ్వి, "పాపం నీ దగ్గర నిజంగానే తినేందుకు ఏమీ లేవు కదా! నా దగ్గరే నయం, కనీసం త్రాగేందుకు కొంచెం అమృతమైనా ఉంది!" అని తన దగ్గర ఉన్న అమృతాన్ని ఒక సీసాలో పోసి ఇచ్చి, "ఇది నీకు చాలా ఉపయోగపడుతుందిలే, పోయిరా ఇంక!" అన్నాడు. విజయ్ దానిని తీసుకొని పోతూ ఉంటే ఒక నగరం కనబడింది.

ఆ నగరంలో ఉన్నవాళ్లంతా ముతక బట్టలు వేసుకున్న విజయ్‌నీ, అతను ఎక్కిన కుంటి గుర్రాన్ని చూసి నవ్వారు. విజయ్ ఏమీ సిగ్గుపడలేదు. ఆ ఊరి రాజుగారి గుర్రపుశాలలో పనికి కుదురుకున్నాడు. అక్కడి గుర్రాలకు మేత వేస్తూ, పని చేసుకుంటూ హాయిగా ఉన్నాడు.

అలా ఉండగా ఒక రోజు రాత్రి మధురమైన గానం వినబడింది. ఎక్కడినుండో, చక్కని పాట ఒకటి, గాలిలో తేలుతూ వచ్చి చేరింది వాళ్ళను. ఆ సమయంలో విజయ్ గుర్రపుశాల బయట మంచం

మీద పడుకొని ఉన్నాడు. కుంటి గుర్రం విజయ్ తో "విజయ్! ఈ పాట పాడుతున్నది ఈ ఊరి రాజకుమార్తె. నువ్వు ఇప్పుడు బయలుదేరి ఆ యువరాణి దగ్గరికి వెళ్ళు. నీకు మేలు జరుగుతుంది" అన్నది.


సరేనని, విజయ్ పాట వినబడే వైపుకు వెళ్ళాడు. తోట బయట ఉన్న కాపలావాళ్ళు అతన్ని లోపలికి పోనివ్వలేదుగానీ, లోపలినుంచే అతన్ని చూసిన యువరాణి మాత్రం అతన్ని లోపలికి రమ్మన్నది. చూడగా ఆమె ముసుగు వేసుకొని ఉన్నది! "నేను మూడు ప్రశ్నలు అడుగుతాను- నువ్వు వాటికి సరియైన సమాధానాలు చెబితే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అన్నదామె. విజయ్ 'సరే' అన్నాడు.

"మొదటి ప్రశ్న: నేను ఎందుకు ముసుగు వేసుకున్నాను?" అడిగింది యువరాణి.

"నీ అందం చూస్తే ఇక ఎవ్వరూ సమాధానాలు చెప్పలేరు అని" అన్నాడు విజయ్.

యువరాణి అతన్ని మెచ్చుకొని, రెండవ ప్రశ్న వేసింది: "మా అన్నయ్య ఒక కుంటి గుర్రంగా మారాడు. అదేమి కథ?" అని అడిగింది యువరాణి.

"దీనికి జవాబు ఆ కుంటి గుర్రమే చెప్పాలి" అని చెప్పి, విజయ్ వెళ్ళి తన కుంటి గుర్రాన్ని తెచ్చాడు. యువరాణిని చూడగానే కుంటి గుర్రం కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. అది ఏమీ చెప్పకనే యువరాణి మూడో ప్రశ్న సంధించింది:




"కుంటి గుర్రానికి జీవాన్నిచ్చే అమృతం ఎక్కడ దొరుకుతుంది?" అని.

'అమృతం ' అనేమాట వినగానే విజయ్‌కి బిచ్చపుతాత ఇచ్చిన సీసా గుర్తుకువచ్చింది. అతను దాన్ని ఒక గిన్నెలోపోసి, తను ముందు దాన్ని కొంత రుచి చూసి, గుర్రం ముందు పెట్టాడు-

మరుక్షణం మునిశాపం తీరిన ఆ కుంటి గుర్రం, ఒక అందమైన రాకుమారుడిలాగా మారిపోయింది!

యువరాణి సంతోషంగా విజయ్‌ని వరించింది. ఆ తర్వాత ఇక ఏ కష్టాలూ లేవు!



# అసలుకు ఎసరు!



*రచన: ఆర్.ప్రగతి, Z.P.H.S.వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.*

అనగా అనగా వెంకటంపల్లి గ్రామంలో సుశీలమ్మ అనే ముసలమ్మ ఒకామె నివసిస్తూ ఉండేది. ఆమె ఒక చిన్న కొట్టంలో ఉండేది- అదికాక ఆమెకు ఒకే ఒక్క జీవనాధారం ఉండేది- అది ఒక మేకపిల్ల. అవ్వకు ఆ మేకపిల్ల అంటే చాలా ఇష్టం. దానికి కూడా అవ్వ అంటే ప్రాణం. అవ్వకు పెద్దగా శక్తి ఉండేది కాదు గదా, అందుకని ఆ మేక పిల్ల వారం వారం ఒక అడవిని దాటి చెన్నేకొత్తపల్లికి వెళ్ళేది. అక్కడి సంతలో వదిలేసిన కాయగూరలను తిని తిరిగి ఇంటికి వచ్చేది.

ఒక రోజున ఆ మేక సంతకు వెళ్తుంటే దారిలో దానికి ఒక పెద్ద పులి ఎదురైంది. మేక గజగజా వణుకుతూ నిలబడిపోయింది. పులి గర్జిస్తూ మేక మెడను ఒక పంజాతో పట్టుకొని, దాని చెవిలో నోరు పెట్టి "మేకా! నాకు చాలా ఆకలిగా ఉంది. నేను నిన్ను వెంటనే తినేస్తాను- ఏమీ అనుకోకు!" అన్నది. మేకకు అకస్మాత్తుగా తెలివి మేలుకున్నది-అయ్యా! పులి గారూ! నేను ఇప్పుడు, బలంగా లేను- నా కడుపు చూడండి, ఎంత లోపలికి పోయి ఉన్నదో! సంతకు వెళ్ళి కాయగూరలు తిని వస్తే బలంగా ఔతాను. అప్పుడు నన్ను తింటే మీ ఆకలి తీరుతుంది-

ఇప్పుడు ఏం ప్రయోజనం, కొంచెం ఆలోచించండి!" అన్నది. "మరి నువ్వు సంతకు వెళ్ళి మళ్లీ ఇక్కడకు రాకుండా ఎక్కడికైనా వెళితే?" అన్నది పులి, అనుమానంగా.

"తమరు ఇక్కడే ఎదురుచూస్తూ ఉండండి- నేను సంతకువెళ్ళి భోజనం చేసుకొని వస్తాను. ఇవాళ్ళ కాకపోతే రేపైనా దొరకాల్సిందే గదా, మీకు? అంతమోసం చేస్తానా, ఒకే ఊరివాళ్ళం?" అని నమ్మబలికి సంతకు వెళ్ళింది మేక, గండం గడిచిందని ఊపిరిపీల్చుకుంటూ.

సంతలో తృప్తిగా భోజనం చేశాక అది ఆలోచనలో పడింది మళ్ళీ- "తిరిగి ఇంటికి వెళ్ళాలంటే మధ్యదారిలో పులి ఎదురు చూస్తూ ఉంటుంది నాకోసం! ఒకసారి ఎలాగో ఒకలాగ తప్పించుకున్నాను- మళ్ళీ తప్పించుకోవటం కుదరదు. ఏంచేద్దాం?" అని బాగా ఆలోచించి, చివరికి అది ఒక ఇనుప ట్యాంకులో దూరి ముడుచుకొని కూర్చున్నది.ట్యాంకును పడుకోబెట్టి, గణగణ మని దానిని దొర్లించుకుంటూ వస్తోంది. అడవిదారిలో తన కోసం ఎదురుచూస్తున్న పులి కనబడింది దానికి!

పులికి గణగణా దొర్లుకుంటూ వస్తున్న ట్యాంకు కనబడింది. అది దాని వెంటే పరుగెత్తుతూ "ట్యాంకూ,ట్యాంకూ! సంతలో మేక ఏమైనా కనబడ్డదా?" అని అడిగింది. "చూశాను- చూశాను.. గణగణా .. చాలా మంచి మేక అది..గణగణ.. సంతలో భోజనం చేస్తోంది..గణగణ.." అన్నది ట్యాంకులోఉన్న మేక గట్టిగా, ఇంకొంచెం వేగంగా దొర్లేందుకు ప్రయత్నిస్తూ. "కానీ నాకు చాలా ఆకలేస్తోందే, ఏం చేయను?" అని అరచుకుంటూ, పులి తనే సంతకు బయలుదేరి వెళ్ళింది మేక కోసం.

కొద్దిదూరం పులి వెళ్ళిపోయాక, మెల్లగా దొర్లి ట్యాంకులో నుంచి మెల్లగా బయటకు వచ్చి, అటూ ఇటూ చూసింది మేక. తను ఎటో దారి తప్పినట్లుంది. బాగా దాహంకూడా వేస్తున్నది. అక్కడ దానికి పాడుబడ్డ భవనం ఒకటి కనిపించింది. మేక అందులోకి దూరి కడుపునిండా నీళ్ళు త్రాగి, మేడ మెట్లు ఎక్కి పైనున్న గదుల్లో ఏముందో చూద్దామని వెళ్ళింది. చూడగా, అదేదో దొంగల స్థావరంలాగా ఉన్నది- వజ్రాలు, బంగారు నాణాలు అన్నీ కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. వెంటనే అది తనకు వీలైనన్ని వజ్రాలను, బంగారు నాణాలను గబగబా మ్రింగి వేసింది. ఆపైన అది మళ్ళీ ట్యాంకులో కూర్చొని దొర్లుకుంటూ దొర్లుకుంటూ, దారి వెతుక్కుంటూ ఇల్లు చేరుకున్నది!

ఇంటికి చేరుకోగానే అది ఒక రోకలి బండను తీసుకొని ముసలమ్మకు ఇచ్చి, చెప్పింది: "అవ్వా! నాకు విపరీతంగా కడుపు నొప్పి వస్తోంది.

కడుపుకు కుడివైపున రోకలిబండతో ఒక్క సారి కొట్టు" అని. అవ్వ అలాగే కొట్టగానే దాని నోట్లోంచి వజ్రాలు బయటికి వచ్చాయి. అప్పుడు అది రెండోవైపుకు తిరిగి పడుకొని, ఎడమ వైపున కొట్టుమంది అవ్వను. అవ్వ ఎడమ వైపున ఒక్కసారి కొట్టేసరికి అది మ్రింగిన బంగారు నాణాలన్నీ బయటపడ్డాయి!

అవ్వ చాలా సంతోషపడింది. కొన్నాళ్ళకు ఆమె పెద్ద ఇల్లు కట్టించుకొన్నది. ఇక మేకను సంతకు పంపించలేదసలు. దాన్ని ఇంకా చాలా ప్రేమగా చూసుకోసాగింది.

అవ్వ ఇంటికి పొరుగునే నివసిస్తారు, వెంకటరెడ్డి దంపతులు. అవ్వ జీవితంలో మార్పును చూసి వాళ్ళకు కన్నుకుట్టింది. మెల్లగా వాళ్ళు అవ్వతో స్నేహం పెంచుకొని, ఆమెకు ఆ డబ్బు ఎలా వచ్చిందో తెలుసుకొన్నారు. 'మేకను సంతకు పంపించి, అది వెనక్కి వచ్చాక కట్టెతో కొడితే ఇన్ని డబ్బులు వస్తాయా!' అని ఆశ్చర్యపోయి, వాళ్ళ మేకను కావాలని బలవంతం చేసి, సంతకు పంపించారు వాళ్ళు!

అయితే అక్కడ అడవిలో సింహం మేక కోసమే ఎదురు చూస్తోంది ఇన్నాళ్ళూ. ఒక మామూలు మేక తనని మోసం చేసి తప్పించుకున్నదని ఆ సింహం చాలా కోపంగా ఉన్నది. ఇప్పుడు వెంకటరెడ్డి వాళ్ళ మేక నింపాదిగా సంతకు నడచుకొని పోతుంటే దానికి ఎక్కడ లేని ఆవేశం వచ్చింది. పొదల చాటునుండి ఒక్క ఉదుటున దాని మీదికి దూకి, మరోమాట లేకుండా దాన్ని చంపి తినేసింది! తన శత్రువు అదేననుకున్నది మరి!

'మేక ఇంటికి ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు దాన్ని రోకలి బండతో కొడదామా' అని ఎదురు చూస్తున్న వెంకటరెడ్డి దంపతులకు డబ్బూ రాలేదు; మేకా దక్కలేదు!

జోకు

వేలెత్తకు!

టీచర్: రాము భారత దేశం ఎక్కడుందో మ్యాప్ లో చూపించరా.

రాము: నా భారత దేశాన్ని నేను వేలెత్తి చూపించలేను టీచర్!



# చిలుక -కోతి సాయం

సేకరణ: బి.జగదాంబ,9 వతరగతి, ఆంధ్రప్రదేశ్‌గురుకులపాఠశాల, ఎ.పి.ఆర్.ఎస్,దిగ్వాల్

ధనపురంలో గోపాలం,కామాక్షి అనే దంపతులుండేవాళ్ళు. గోపాలానికి పక్షులన్నా, జంతువులన్నా ఎంతో మక్కువ. వాటిని చేరదీస్తూ ఉండేవాడు. అతనికి పూర్తి వ్యతిరేకం కామాక్షి- ఆమెకు గోపాలం చేష్టలు అస్సలు నచ్చేవి కావు.

ఒక రోజు గోపాలం 'మాట్లాడే చిలుక'ని, 'మనిషి లా ప్రవర్తించే కోతి'ని ఇంటికి తీసుకొచ్చాడు. వాటిని చూడగానే కామాక్షికి అలవిగాని కోపం వచ్చింది. "మీరు రోజురోజుకూ చిన్నపిల్లాడిలా మారిపోతున్నారు- వీటిని ఇంటికెందుకు తీసుకొచ్చారు?" అంటూ పెద్ద గొడవ పెట్టుకున్నది. "ముందు వీటిని బయటకు పంపిస్తారా, లేదా?" అని అరవటం మొదలుపెట్టింది.

మామూలుగా అయితే గోపాలం భార్య మాట వినేవాడే, కానీ ఆమె అలా రచ్చ చేయటం అతనికి నచ్చలేదు-సరికదా, కోపం కూడా తెప్పించింది. అందుకని అతను కటువుగా, "ఇవి ఇంట్లో నే ఉండాలి. నాఇష్టం- నేను మాత్రం వీటిని ఇంట్లోనే ఉంచుతా!" అని, పంజరాన్ని ఇంట్లో తగిలించి, కోతిని ఓ మూలన కట్టివేశాడు. ఆ రోజు నుంచి భార్యాభర్తల మధ్య మౌనం రాజ్యమేలింది.

కామాక్షి ప్రతిరోజూ చిలుకను, కోతిని చీదరించుకునేది. గోపాలం మాత్రం వాటిని ప్రాణ ప్రదంగా చూసుకునేవాడు.


ఒక రోజు రాత్రి, పేరుమోసిన గజదొంగ గంగులు వీళ్ళ ఇంటిలో జొరబడ్డాడు. ఆ అలికిడికి కామాక్షికి మెలకువ వచ్చి కేకలు వేయబోయింది. వెంటనే ఆ గంగులు తన చేతిలోని కత్తిని ఆమె మెడకు ఆనించి 'అరిచావంటే చంపేస్తా' అని బెదిరించి, ఆమెను స్థంభానికి కట్టి పడేసాడు. అటుపైన గోపాలానికీ అదే గతి పట్టింది. వాళ్ళు ఇద్దరూ ఇక నోరు మెదపకుండా కట్టేసాక, వాళ్ళను వదిలి ఇనపపెట్టె ఉన్న గదిలోకి వెళ్ళాడు గజదొంగ.

ఇదంతా గమనిస్తున్నై, కోతీ చిలుకా. మాట్లాడే చిలుక కోతితో మెల్లగా అన్నది "మిత్రమా, చూశావుగా!? దొంగ ఆ గదిలోకి వెళ్ళాడు! నిన్ను కట్టిన త్రాడు బాగానే పొడవు ఉన్నది- తొందరగా రా, దొంగ దూరిన గది తలుపుకు గడియ వేసేయ్!" అని. ఒక్క ఉదుటున ముందుకు దూకిన కోతి తక్షణం గది తలుపులు మూసి, గడియ వేసేసింది.

జరుగుతున్నది చూసిన గోపాలం, కామాక్షిలు నోళ్ళు వెళ్ళబెట్టారు. కోతి వెళ్ళి వాళ్ళ కట్లు విప్పేసింది. అంత పేరు మోసిన గజదొంగను పట్టించినందుకు పోలీసులు వాళ్ళను ఎంతగానో మెచ్చుకున్నారు. పెద్ద బహుమతినే ఇచ్చారు.

"చూశావా, ఈ మామూలు జంతువులు మనకు ఎంత సహాయం చేశాయో, ఆపదలో?" అన్నాడు గోపాలం, కామాక్షితో.

"నన్నుక్షమించండి! ఇకమీద అన్ని ప్రాణులనూ గౌరవిస్తాను- వేటినీ తక్కువ చేసి చూడను" అన్నది కామాక్షి తలవంచుకొని.





# బుజ్జి ఇంట్లో బాల హనుమాన్

*రచన: అభిరాం గోదావరి (5 వ తరగతి) శ్రీమతి జి. లలిత*

బాల హనుమంతుడు పరిగెత్తుకుంటూ ఇంట్లోకెళ్ళాడు. అమ్మ కోసం చూశాడు. అమ్మ ఎక్కడా కనిపించలేదు. బయటికి వచ్చి ఇంటి చుట్టు పక్కల చూశాడు. బయట కూడా లేదు! మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి ప్రతి గదిలోనూ చూశాడు. "అమ్మా, అమ్మా" అని బిగ్గరగా పిలిచాడు. జవాబు లేదు.

ముందు గదిలో తివాచీ చుట్ట చుట్టి ఉంది. ఆ మూలన మనిషి ఎత్తున ఒక శిల్పముంది. అది ఇంట్లోకి కొత్తగా వచ్చినట్లుంది. ఇన్నాళ్ళూ లేదది. ఆఖరికి తను పొద్దున ఆడుకోవడానికి బయటికి వెళ్ళినప్పుడు కూడా లేదు.



వంటిట్లోకి వెళ్ళి చూశాడు. అక్కడ అమ్మ వండి ఉంచిన పిండి వంటలున్నాయి.

నోరూరిస్తుంటే గబుక్కున ఒక లడ్డూ నోట్లో వేసుకున్నాడు. బయట ఏదో అలికిడి వినిపించింది. చెంగుమని గెంతి పెరట్లోకి వెళ్ళాడు. చెట్ల ఆకులు చిన్నగా కదిలాయి. అటు వైపు చూశాడు. తన స్నేహితులెవరో తనతో దాగుడు మూతలు ఆడుతున్నారు. ఇది ఆడుకునే సమయమా? అమ్మ ఎక్కడుందో వెతకాలి.

తన స్నేహితుల పేర్లు పెట్టి గట్టిగా పిలిచాడు. అక్కడక్కడా ఎవరో కొమ్మల మీద గెంతి, ఆకుల మాటున దాక్కోవడానికి ప్రయత్నిస్తున్న చప్పుడే వినిపిస్తోంది -కానీ, ఎవరూ బదులు పలకరే? "మా అమ్మని చూశారా? ఇంట్లో లేదు. ఎక్కడికి వెళ్ళిందో తెలీదు!" అని బిగ్గరగా అరిచాడు. ఇంకొంచెం అలికిడే తప్ప సమాధానం లేదు.

ఇంతలో "హనుమంతూ!" అని ముందు గదిలోంచి ఎవరో పిలిచినట్లనిపించింది. అమ్మ గొంతులా ఉంది. పరిగెత్తుకు వెళ్ళి చూస్తే అమ్మ లేదు. కానీ తివాచీ పరిచి ఉంది. గోడల మీద తీగెలు అలంకరించి ఉన్నాయి. చూరు నుంచి వేళ్ళాడుతూ సూర్యుడిలా కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ గాజు బంతి ఉంది. తను సూర్యుడిని పండు అనుకుని పట్టుకోబోయిన విషయం గుర్తుకు వచ్చి మెల్లగా నవ్వుకున్నాడు హనుమంతుడు. అనాలోచితంగా ఆ బంతిని పట్టుకోవడానికి ఎగిరాడు. అది కాస్త పైకి జరిగింది. ఆశ్చర్యపోయాడు. అందుకోవడానికి మళ్ళీ పైకి ఎగిరాడు. ఇంకాస్త పైకి జరిగింది అది. ఈ సారి ఒక్క ఉదుటున మెరుపు వేగంతో పైకెగిరి ఆ బంతి పైకి జరిగే లోపు, మెళుకువతో పట్టుకున్నాడు. చుట్టూ చప్పట్లు, కిచ కిచలు, కేరింతలు, నవ్వులూ వినపడ్డాయి. తన స్నేహితులందరూ వాళ్ళు దాకున్న చోట్లనుంచి ఒక్క సారిగా బయటకి వచ్చారు. ఇంతకీ అమ్మేదీ?



కొత్తగా కనిపించిన శిల్పం వెనక నుంచి వచ్చి బుగ్గ మీద ముద్దు పెట్టింది. "ఎప్పుడూ అల్లరి చేస్తూ నన్ను కంగారు పెడుతుంటావు గదా, ఇప్పుడు నా వంతు!" అంది. అర్థం కానట్టు చూస్తున్న హనుమంతుడిని దగ్గర తీసుకుని "ఈ రోజు నీ పుట్టినరోజురా, కన్నా!" అని ఆశీర్వదించింది. ✿



# రాచబిడ్డ

ముగింపు ఏమిటి?

*రచన: కె.సురేష్, 8 వతరగతి, ప్రకృతిబడి.*



అమరాపురం రాజావారికి లేకలేక ఒక వారసురాలు పుట్టింది. సుజాత అనే ఆ పాపను ఆయన తన ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించాడు. చాలా గారాబంగా పెంచాడు. ఆ పాపకు మూడేళ్ళ వయసున్నప్పుడు అనుకోకుండా ఒక దుర్ఘటన జరిగింది. ఆమెను ఎత్తుకొని పిల్లలు కొందరు దగ్గర్లో ఉన్న అడవికి వెళ్ళారు, వన భోజనాల కోసమని- పిల్లలందరూ కలిసి ఆడుకుంటూ ఆడుకుంటూండగా కారు మబ్బులు క్రమ్ముకొని, అకస్మాత్తుగా పెద్ద వర్షం మొదలైంది. పిల్లలందరూ ఎవరికివాళ్ళు హడావిడిగా వెనక్కి పరుగెత్తారు- సుజాత మాత్రం అడవిలోనే మిగిలిపోయింది!

మెరుపులకు, ఉరుములకు భయపడి, ఆ పాప ఏడవటం మొదలుపెట్టింది. అదే సమయానికి గబగబా పోతున్న ఒక ముసలాయన ఆ పాప ఏడుపును విని అటు వెళ్ళి చూశాడు. అతను ఏమంత మంచివాడు కాదు. ఎవరో డబ్బున్న పాప, ఒంటరిగా అలా అడవిలోఉండటం చూసి, అతని మెదడులో ఏవేవో ఆలోచనలు మెరిసాయి: 'ఆ

పాపను అడ్డం పెట్టుకొని తను చాలా డబ్బులు సంపాదించవచ్చు! ఇంతకీ ఈ పాప ఎవరో కనుక్కోవాలి'- అని అతను ఆ పాపతో ప్రేమగా మాట్లాడి, ఆమెను పొరుగూరులో ఉన్న తన ఇంటికి తీసుకెళ్ళిపోయాడు.



"నీ పేరేంటమ్మా" అంటే 'సుజాత' అని చెబుతున్నది తప్ప, ఆ పాప ఇంకే వివరాలూ చెప్పలేకపోతున్నది. "మీ అమ్మ ఎవరు?" అని అడిగితే "అమ్మ" అంటున్నది. "మీ నాన్న ఎవరు?" అంటే "నాన్న " అంటున్నది! కొన్ని రోజులవరకూ ముసలివాడు ఆ పాప తల్లిదండ్రులకోసం వెతికాడు- వాళ్ళెవరో తెలిస్తే వాళ్లను డబ్బులు అడగచ్చని ఆశపడ్డాడు. రాను రాను అతనికి ఆ ఆశా అడుగంటింది. దగ్గర్లోఎవరి పాప పోయిందో అతనికి తెలియనేలేదు, ఎంతకీ. చివరికి అతను నిరాశపడి, 'కానీలే, నేను పెద్దవుతున్నాను. ఏపనీ చేయలేక పోతున్నాను. ఈ పాపను రెండేళ్ళు సాకితే సరి, అన్ని పనులూ ఈమెతో చేయించచ్చు!' అని సర్దుకున్నాడు.

ఆలోగా అక్కడ, రాజావారు తన మనుషుల్ని అన్ని వైపులా పంపి వెతికించారు. వాళ్ళుఅన్ని ఊళ్లూ వెతికారుగానీ, ఈ తాత ఉంటున్న మామిడి తోటను మాత్రం వెతకటం మరచారు! ఇక ఆ పాప ఎక్కడ దొరుకుతుంది? రాజావారు, రాణిగారు విచారంతో చిక్కి శల్యమైపోయారు.

కొన్నాళ్ళకు ఆ తాతకు తెలిసింది, సుజాత ఎవరి బిడ్డో. కానీ ఆ సరికి అతనికి ఆ పాప అంటే ఇష్టం ఏర్పడింది. తనకు పనులు చేసిపెట్టేందుకు, ముసలితనంలో తనను చూసుకునేందుకు ఈ పాప ఉంటే మేలనిపించింది అతనికి. అందుకని అతను తనకు ఇక నిజం తెలిసినా తెలియనట్లుగా ఉండిపోయాడు.

సుజాతకేం తెలుసు, ఇవన్నీ? అతనే తన తాత అనుకున్నది. తాత తన స్వార్థం కొద్దీ సుజాతకు తిండి పెట్టాడు; పనులన్నీ నేర్పించాడు. పాప కొంచెం పెద్దదయ్యేసరికి, తోటలో కాసిన మామిడికాయలు అమ్ముకొని రమ్మని ఆ పాపను దగ్గరి ఊళ్ళకు పంపించటం కూడా మొదలు పెట్టాడు. ఆ పాపకు అతను ఎప్పుడూ చెబుతూ ఉండేవాడు- "ఏ దిక్కుకైనా పో- కానీ ఉత్తర దిక్కుకు మాత్రం పోవద్దు" అని. ఎందుకంటే ఉత్తర దిక్కుననే ఉంది మరి, రాజావారి పరగణా!




చాలా సంవత్సరాల పాటు తాత మాట జవదాటలేదు, సుజాత కాయలమ్మేందుకు ఎప్పుడు వెళ్ళినా మూడు దిక్కులకే వెళ్తుండేది. అయితే ఒక రోజున మూడు దిక్కుల్లోనూ ఎంత తిరిగినా ఆమె తట్టలో ఉన్న కాయలు అమ్ముడు పోలేదు. "ఈ కాయల్ని ఇంటికి తీసుకొని పోతే తాత తిడతాడే, ఎలాగ?" అని విచారం వేసింది ఆమెకు. "సరే, ఎలాగైతే అలాగ కానీ, అటువైపుకూ వెళ్ళి చూస్తాను" అని ఉత్తరం దిక్కుకు పోయింది.

అక్కడ రాణిగారు సుజాతను చూడగానే ముచ్చటపడింది. ఆమెను వాళ్ళ ఇంటికి పిలిచి కాయలు తీసుకుంటూ "పాపా, మీ అమ్మానాన్నలు ఎవరు?" అని అడిగింది- "నాకూ ఒక పాప ఉండేదమ్మా, సరిగ్గా నీ అంతే ఉంటుంది ఆ పాప ఇప్పుడు!" అని చెబుతుంటే ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నువ్వు ఇవాళ్ళ మాతోబాటే ఉండిపోరాదూ, రేపు తిరిగి వెళ్దువు" అంటే, సుజాత 'సరే' అని అక్కడే ఉండిపోయింది.

చీకటి పడ్డా సుజాత ఇంటికి రాకపోయేసరికి, ముసలాయన కంగారు పడి, అందరినీ అడిగాడు. చివరికి అతనికి సుజాత ఉత్తరం దిక్కుకు వెళ్ళిందని తెలిసింది- వెంటనే అటువైపుకు బయలుదేరి వెళ్ళి. తెల్లవారే సరికి అమరాపురం చేరుకొన్నాడతను. అంతలోనే మిద్దెపైనుండి అతన్ని చూసింది, సుజాత తాతను కూడా లోనికి రమ్మని పిలిచింది. తాత ససేమిరా రానన్నాడుగానీ, చివరికి రాజాగారి మనుషులు అతన్ని బలవంతం చేసేసరికి లోపలికి రాక తప్పలేదు. రాజావారినీ, రాణిగారినీ, సుజాతనూ చూడగానే 'వీళ్ళకు అంతా తెలిసిపోయినట్లుంది' అనుకున్నాడతను. వెంటనే రాజావారి కాళ్ళమీదపడి నిజం ఒప్పేసుకున్నాడు.

జమీందారు గారు మొదట ఒకింత నిర్ఘాంతపోయారు- ఆపైన అతను చేసిన పనిని తలచుకొని ఆయనకు విపరీతమైన కోపం వచ్చింది.

ఇప్పుడు మీరే చెప్పండి- ముసలివాడికి ఆయన ఏమి శిక్షవిధించాలి?



# కుందేలు - ఉడత స్నేహం



*రచన: C.జ్యోతి, 6,వతరగతి, బసినేపల్లి.*

ఒక అడవిలో కుందేలు, ఉడత మంచి మిత్రులు. కొన్ని రోజుల తరువాత అవి రెండూ ఎందుకనో, బాగా గొడవ పడి, విడి పోయాయి. ఉడతకు ఇక అక్కడ ఉండటం కూడా ఇష్టం కాలేదు. అది ఆ అడవిని విడిచి వెళ్ళాలని నిర్ణయించుకున్నది. ప్రక్క అడవికని బయలు దేరి వెళ్లింది. ఆ క్రొత్త అడవిలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నది.

అట్లా అది ఆ అడవిలో తిరుగుతూ ఉండగా ఒక ఎలుక కనిపించింది. ఎలుక "ఇంతకూ ఎవరమ్మా, నువ్వు? ఎందుకు, ఇక్కడికి వచ్చావు?" అని అడిగింది. ఉడతకు దు:ఖం తన్నుకొచ్చింది. అది భోరున ఏడుస్తూ తన కథను వివరించింది. కుందేలు తనను ఎలా మోసం చేసిందో చెప్పింది. ఎలుక దాన్ని ఓదార్చి, "ఏడవకు! ఇవాల్టి నుండీ మనం ఇద్దరం స్నేహితులం! ఒకరికొకరం సహాయం చేసుకుందాం, సంతోషంగా ఉందాం" అని చెప్పింది. అందుకు ఉడతకూడా చాలా సంతోష పడింది.

ఇక అక్కడ, ఉడతతో పోట్లాడిన కుందేలు కోపంగా ఒక గుహ ప్రక్కగా వెళ్తుంటే, దానికి

సింహం, ఏనుగు ఎదురు వచ్చాయి. "ఏమిటి మిత్రమా, సంగతి? ఎందుకు, అలా ఉన్నావు?" అని అడిగాయవి, కుందేలును. కుందేలు జరిగిన విషయాన్ని వివరించింది. వాటికి ఉడత తనను ఎన్నెన్ని మాటలన్నదో చెప్పింది. "మరి ఆ అక్కడి ఉడతను కక్కడే చంపెయ్యక పోయావా?" అన్నాయి ఆ రెండూ. "సరే, ఇప్పటికైనా ఏముంది? పద, మేమూ వస్తాం. ముగ్గురం కలిసి దాని సంగతి చెప్పుదాం!" అన్నాయి. కుందేలు కొంచెం వెనుకడుగు వేసింది."ఎందుకులే, అది ఎటో వెళ్ళి పోయి ఉంటుంది!" అని అది అన్నా మిగిలిన రెండూ వినలేదు. అలా ఆ మూడూ కలసి బయలుదేరాయి- ఉడతను చంపేసేందుకు. .


తీరా అక్కడికి వెళ్లి చూస్తే ఉడత కనబడలేదు. అవి మూడూ కలిసి అక్కడే ఉన్న చీమను అడిగాయి "ఉడత ఎటు వెళ్ళిందో చూశావా?" అని. "ఏడ్చుకుంటూ ఆ రెండో అడవి వైపు వెళ్ళటం చూశాను" అన్నదది.

ఆ అడవి అన్నిటికీ కొత్తే! అయినా, ఉడత మీది కోపం కొద్దీ "కానీలే! ఆ అడవిలోకే వెళ్ళి పట్టుకుందాం, దాన్ని ఎలాగైనా చంపెయ్యాల్సిందే!" అని కుందేలు, సింహం, ఏనుగు అటువైపుకు నడవసాగాయి.

ఇక అక్కడ, ఎలుక ఉడత అడవిలో తిరుగుతూ ఒక వంతెనను చేరుకున్నాయి. అంతలో వాటికి ఒక వింత శబ్దం వినబడింది. "అదేం శబ్దమో!" అని అవి రెండూ మెల్లగా ఒక చెట్టు చాటున దాగి చూశాయి. అక్కడొక వేటగాడు- వంతెన క్రింద పేలుడు పదార్థాలు సమకూర్చుకుంటూ కనబడ్డాడు! వాడు తనలో తానే మాట్లాడుకుంటూ గట్టిగా "హుం..ఈ రోజు నాకు మంచి రోజు. ఇవాళ్ళ చాలా జంతువులు దొరుకుతై. నా అదృష్టం బాగుంటే ఒక ఏనుగు కూడా దొరకవచ్చు!" అనుకుంటున్నాడు. అంతలో వంతెనకు అటువైపునుండి అక్కడికి కుందేలు, సింహం, ఏనుగు నడచి వస్తూ కనబడ్డాయి.

"చూశావా మిత్రమా? కుందేలు నిన్ను చంపాలని వీటిని వెంటబెట్టుకొని వస్తున్నది! వీటికి తగిన శాస్తి జరగాల్సిందే. చూడు, ఇప్పుడు అవి వంతెన మీదికి రాగానే వేటగాడు వంతెనను పేల్చేస్తాడు!" అన్నది ఎలుక, ఉడతతో. ఉడతమాత్రం ఇక ఉండబట్టలేకపోయింది: "ఆగు మిత్రమా! ఇక్కడికి రావద్దు! వంతెన ఎక్కకండి! వెనక్కిపోండి! క్రింద వేటగాడు ఉన్నాడు!" అని గట్టిగా అరిచింది. ఆ అరుపులు వినగానే కుందేలు, సింహం, ఏనుగు గబుక్కున వెనక్కి పరుగెత్తాయి. అంతలోనే వేటగాడు ప్రేలుడు,పదార్థాన్ని పేల్చేశాడు. ఆప్రేలుడుకు వంతెన అంతా కుప్ప

కూలిపోయింది.



కుందేలు, సింహం, ఏనుగు "అమ్మయ్య! ఎంత ప్రమాదం తప్పింది! ఈ ఉడత సాయం చెయ్యకపోతే మనం కూడా ఈ వంతెనతోబాటు కూలిపోయి ఉండేవాళ్ళం. ఇంత మంచి మిత్రుడినా, మనం చంపాలను కున్నది?" అని సిగ్గుపడ్డాయి.

సింహం, ఏనుగు, కుందేలలకు ఏమీ కాలేదని గమనించిన వెంటనే వేటగాడు అక్కడినుండి ఉడాయించాడు. అవి మూడూ తలలు వంచుకొని ఎలుక, ఉడతల దగ్గరకు వెళ్ళి క్షమాపణ కోరాయి. మంచిమనసు గల ఉడత, ఎలుక వాటిని క్షమించి అక్కున చేర్చుకున్నాయి. అప్పటి నుండి కుందేలు , సింహం, ఏనుగు, ఎలుక, ఉడతల స్నేహం కలకాలం వర్ధిల్లింది!

## నిప్పులెందుకు?

జోకు

ఒక అతను హోటల్ కి వచ్చి, సర్వరుతో:

అతను: వేడిగా ఏమున్నాయ్ అంటాడు.

సర్వరు : ఇడ్లీలు సార్.

అతను :ఇంకా వేడిగా ఏమున్నాయి.

సర్వరు : వడలు.

అతను : ఇంకా వేడిగా ఏమున్నాయి.

సర్వరు : కోపం వచ్చి వేడి వేడిగా నిప్పులు ఉన్నాయి సార్.

అతను : అవే త్యాపో అంటాడు.

(సర్వరు నిజంగానే తెస్తాడు)

(అతను బీడీ కాల్చుకొని త్రాగుతూ పోతాడు)

*విశ్వనాథ్, ప్రకృతి బడి.*



# మొరటోడి బాధ్యత

*రచన: హేమంత్‌కుమార్, 8 వతరగతి, Z.P.H.S.వెంకటంపల్లి.*

ఒక ఊరిలో ఒక తల్లి , తండ్రి , కొడుకు ఉండేవాళ్ళు . వాళ్ళకు గొర్రెలు , ఎద్దులు, బండి , బావి, తోట ఉండేటివి. ఒక రోజు వాళ్ల నాన్నకు పక్క ఊరిలో కొంచెం పని పడింది. ఆయన అప్పుడు కొడుకును పిలిచి "నాయనా! నాకు ప్రక్క ఊరిలో కొంచెం పని ఉంది. నేను వెళ్తున్నాను; ఈ రోజు నువ్వు బడికి పోకుండా గొర్రెలు తోలుకపో; మళ్ళీ నేను తొందరగా వచ్చేస్తాను - కొద్ది సేపు పోయిరా నాయనా దయచేసి!"అని చెప్తాడు.

వాడు 'సరే' అంటే, అప్పుడు వాళ్ళ అమ్మ ఆ పిల్లవాడికి పెసల్లు వేయించి ఇచ్చి గొర్రెలలోకి పంపించింది.

ఆ పిల్లవాడు గొర్రెలను ఒక చెట్టు కిందికి తోలి, తను ఒక గుండు మీద కూర్చొని ఆ పెసల్లు తినటం మొదలుపెట్టాడు. "కరమ్.., కరమ్.." అని నములుతున్నాడు పెసల్ని- గొర్రెలు కూడా అలాగే నములుతున్నాయి తుమ్మకాయల్ని. అది వినగానే ఆ పిల్లవాడికి కోపం వచ్చేసింది- "ఆఁ, ఎంత పొగరు! నేను ఎట్లా తింటే మీరూ అలా

తింటారా?! నన్ను ఎగతాళి చేయటం తప్ప మీకు వేరే పనేమీ లేదా?" అని చిలుకకొడవలితో గొర్రెలను అన్నింటిని నరికేశాడు.

వాళ్ళ నాన్న వచ్చి అదంతా చూసి నెత్తీ నోరూ బాదుకున్నాడు- "ఎందుకురా, ఇట్లా చేశావు? నీకు ఏమన్నా తిన్నది అరగలేదా, ఈ పని చేశావు? గొర్రెలన్నీ పోగొట్టుకొని ఇంక ఎట్లారా బ్రతికేది? ఇకమీద నువ్వు ఎక్కడికీ పోనక్కర్లేదు. ఇంటి దగ్గర ఉండు!" అని బాగా తిట్టాడు. అప్పటినుండీ వాడికి ఒక్కడికే ఏ పనీ చెప్పటం మానుకున్నారు వాళ్ళు.

ఇలా ఉండగా, ఒకరోజున ఆ పిల్లవాడిని ఒక్కడినే ఇంటి దగ్గర వదిలి , బావి దగ్గరకు వెళ్ళారు వాళ్ళ అమ్మానాన్నలు. వాడు కులాసాగా కొంచెంసేపు పడుకుందామనుకున్నాడు. వాళ్ళ ఇంటికి, పక్క ఇంటికి మధ్య ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో మంచం వేసుకొని పడుకున్నాడు.

అంతలో పక్క ఇంటి నుండి ఒక ఎలుక బయటికి వచ్చింది- వీడు పడుకొని దాన్నే చూస్తూ- "నువ్వు మాయింట్లోకి రా, నీ పని చెబుతాను!" అని బెదిరించాడు దాన్ని, అంతలోనే అది పరుగెత్తి వాళ్ళ ఇంటిలోకే దూరింది!

అప్పుడు ఆ పిల్లవాడు "ఆఁ! ఎంత ధైర్యం నీకు!? నేను ఇక్కడ ఉండగానే మా ఇంటిలో దూరతావా?" అని అరుస్తూ దాని వెంట పడ్డాడు. ఇల్లంతా గాలించైనా సరే, ఆ ఎలుకను పట్టుకొని చంపాలనుకున్నాడు. కానీ ఎటు పోయిందో, ఏమో- ఎంత వెతికినా ఆ ఎలుక మాత్రం కనబడలేదు. వాడికి చాలా కోపం వచ్చింది. "నిన్ను ఎట్లా బయటికి రప్పించాలో నాకూతెలుసు-" అని, ఒక అగ్గిపెట్టెను తీసుకొచ్చి తమ ఇంటికి తనే నిప్పు అంటించాడు.

ఆ సమయానికి గాలి బాగా వీస్తూండటంతో పక్క వాళ్ళ ఇల్లుకూడా అంటుకున్నది. వీధిలోని జనాలంతా అరుస్తూ ఆ మంటల్ని ఆపటానికి విశ్వప్రయత్నం చేస్తుంటే వీడు మాత్రం భయపడి, ముడుచుకొని పడుకుండిపోతాడు. సంగతి తెలిసి హడావిడిగా పరుగెత్తుకొచ్చారు వాళ్ల అమ్మ-నాన్న. ఆసరికి ఇల్లంతా బాగానే కాలి బూడిదైంది. "ఎందుకైందిరా ఇట్లాగ? నువ్వేమైనా చేశావా?" అని అడిగితే "నేనే అంటించాను- లేకపోతే పక్కింటి వాళ్ళ ఎలుక మనింట్లోకి ఎందుకట, వచ్చేది?" అన్నాడు వాడు. తల్లీ తండ్రీ నెత్తీ నోరూ కొట్టుకున్నారు. తండ్రి "వీడిని ఇంట్లోంచి పంపించేద్దాం" అన్నాడు, గానీ తల్లి ఒప్పుకోలేదు. "మరొక్క అవకాశం ఇచ్చి చూద్దాం" అని నచ్చ చెప్పింది.

తరువాత కొన్ని రోజులకు ఎప్పటిలాగానే తల్లి, తండ్రి ఇంట్లో అన్నం వండిపెట్టి, చేనుకు వెళ్ళారు. పని చేస్తూ ఉంటే మధ్యాహ్నం అయ్యింది.

మూడు ముద్దలు అన్నం తీసుకురమ్మని కబురు పంపారు కొడుక్కు. అప్పుడు ఆ పిల్లవాడు బువ్వ తీసుకొని, ఎద్దుల బండి కట్టుకొని బయలు దేరాడు.



ఆ బండి బాగా పాతది. అది నడుస్తుంటే "కిర్..,కిర్.." అని శబ్దం వస్తున్నది. పిల్లవాడు కొంచెం సేపటికి గానీ ఆ శబ్దాన్ని గమనించలేదు. ఆ తర్వాత "పాపం! ఈ బండికి చాలా ఆకలిగా వున్నది- అందుకనే కిర్..కిర్ అని మొత్తుకుంటున్నది" అని బండి చక్రం ఇరుసులో ఒక ముద్దను వేసి నడుపుకుంటూ పోయాడు. కొంచెం సేపు ఊరుకున్న బండి, మళ్ళీ "కిర్..కిర్.."మనటం మొదలు పెట్టింది. "ఇంకా ఆకలి అవుతున్నట్లుంది" అని మరో ముద్ద కూడా వేశాడు పిల్లవాడు. కొంచెం సేపు ఊరికే ఉందిగానీ, బండి మళ్ళీ "కిర్..కిర్..కిర్" మనటం మొదలు పెట్టింది.

"పాపం ఈ బండికి దాహం అవుతున్నట్లుంది. నీళ్ళు కావాలేమో!" అనుకొని, పశువుల్ని విప్పి, బండిని చెరువులోకి తోశాడు పిల్లవాడు. "దప్పికతీరాక బండి వెనక్కి వస్తుందిలే" అని వాడు పశువులతోబాటు ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు.

అంతలో ఆ చెట్టు మీద వాడికొక చక్కని పిట్ట కనబడింది. దానిని పట్టుకుందామనుకున్నాడు వాడు. కానీ చేతిలో పశువుల ముకుత్రాళ్ళు ఉన్నవాయె! మరెలాగ? అందుకని వాటిని పట్టుకొనే చెట్టెక్కటం మొదలు పెట్టాడు వాడు. క్రిందనున్న పశువులు పైకి ఎలా వస్తాయి? అవి వాడిని వెనక్కి లాగటం మొదలు పెట్టాయి. వాడికి కోపం వచ్చి మరింత గట్టిగా లాగాడు త్రాళ్ళను. చివరికి ఆ పెనుగులాటలో త్రాళ్ళు కాస్తా తెగిపోయాయి; పశువులూ పారిపోయాయి; బండి కాస్తా చెరువు పాలైంది.

ఇక తట్టుకోలేకపోయాడు, వాళ్ళ నాన్న. "నువ్వు ముందు ఈ ఇల్లు వదిలి పెట్టి పో! సొంతగా ఏమైనా సంపాదించేంత వరకూ ఇంటికి రాకు! బాధ్యత తెలియని వాడు పెద్దవాడెట్లా అవుతాడు?" అని వాడిని ఇంట్లోంచి బయటికి పంపించేశాడు.

వాడి ప్రార్థన అయ్యాక,పిల్లవాడు దిగులుగా ఏడుస్తూ పోతూంటే పాడుబడ్డ గుడి ఒకటి


కనబడింది. ఆ గుడిలో విగ్రహం ముందు చేతులు కట్టుకొని నిలబడి ఉన్నాడు- ఒక దొంగ. వాడు భక్తితో కళ్ళు మూసుకొని దేవతకు చెబుతున్నాడు- "తల్లీ! నీ దయవల్లనే నాకు ప్రతిరోజూ నాకు డబ్బులు , నగలు, బంగారం , వెండి అన్నీ దొరుకుతున్నాయి" అని.



పిల్లవాడు ఆ దొంగ దగ్గరకు వెళ్ళి, "అన్నా! మా అమ్మ-నాన్న నన్ను ఇంట్లోంచి పంపించేసారు. నాకు ఇప్పుడు తినేందుకు కూడా ఏమీ లేదు. నేను కూడా నీతోనే ఉంటూ అవీ ఇవీ చేసి పెడతాను- నాకు కడుపునిండా అన్నం పెట్టు, చాలు" అని ప్రాధేయపడ్డాడు. దొంగ కొంచెం సేపు ఆలోచించాడు- 'తనతోబాటు ఒక పిల్లవాడిని ఉంచుకుంటే అనుకూలంగా ఉంటుందిగదా' అని, సరేనన్నాడు. ఇక ఆ పిల్లవాడు దొంగతో కలిసి ఒక ఇంట్లో దొంగతనం చేసేందుకు పోయాడు.

దొంగ తనకు కావలసిన బంగారంకోసమూ, డబ్బులకోసమూ వెతుక్కుంటూంటే, పిల్లవాడు 'తనకు పనికొచ్చేవి ఏమున్నాయా' అన్నట్లు అటూ ఇటూ చూడసాగాడు. అంతలో అతని చూపు గోడకు తగిలించిన తప్పెటమీద పడింది. దొంగను అడిగాడు- "అన్నా, అన్నా, ఇది చాలా బాగుంది. దీన్ని వాయించనా?" అని. "నీకేమీ పనిలేదా? ఊరుకో" అని కసిరాడు వాడు. దాంతో పిల్లవాడికి కోపం వచ్చింది. "నన్నే కసరుతావా, నీపని చెబుతాను చూడు" అని వాడు వెళ్ళి తప్పెటనందుకొని, ఢమఢమలాడించాడు. ఇంకేముంది? ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళూ అందరూ లేచి, దొంగ తేరుకునేలోపల వాడిని పట్టుకొని కట్టేసి, గదిలో పడేశారు. ఆ తర్వాత పోలీసులు రావటమూ, దొంగను పట్టుకు పోవటమూ, వాడిని పట్టించిన పిల్లవాడికి అనేక బహుమతులివ్వటమూ జరిగిపోయాయి.

ఆలోగా వాడిని గుర్తుపట్టిన వాళ్ళెవరో ఆ కబురు వాళ్ళ అమ్మానాన్నలకు చేరవేశారు. 'వాడు ఏమైనాడో' అని కలవరపడుతున్న తల్లి పరుగున వచ్చి, వాడిని వెంటబెట్టుకెళ్ళింది- "ఇప్పుడు ఇన్ని బహుమతులు వచ్చాయి గద నాయనా, ఇకమీద నైనా బాధ్యతగా ఉండు!" అని చెబుతూ.




# సింహంతో యుద్ధం

**యోగికథలు-1**



రచన: E.యోగేశ్వరరెడ్డి, VII Rose, అరవిందహైస్కూలు, కుంచనపల్లి, విజయవాడ-77

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం పేరు విష్ణుపురం. అక్కడ రాజు వీరభద్ర. అదే రాజ్యంలో ఒక జైలు ఉంది. తను ఓడించిన రాజులను చంపకుండా అక్కడికి తీసుకొని వచ్చి అందులో బంధించేవాడు ఆయన.

కొంత కాలానికి ఆ రాజ్యంలో సైన్యాధిపతి పదవి ఖాళీ అయ్యింది. తను ఓడించిన రాజులలోనుండి ఒక శక్తివంతమైన రాజును తీసుకొని, తన సైన్యాధిపతిగా చేర్చుకోవాలనుకున్నాడు వీరభద్ర. కానీ 'సైన్యాధిపతి' అంటే మామూలు కాదు- అతడు యుద్ధంలో ముందుండి సైన్యాన్ని నడిపించాల్సి ఉంటుంది. కాబట్టి "సింహంతో యుద్ధం ఎవరైతే చేస్తారో- వారికే ఆ పదవి అప్పగించాలి" అని రాజు అనుకున్నాడు.

అయితే ఆ జైలులో ఎవరూ దానికి ఒప్పుకోలేదు. అందరినీ అడగ్గా, చిట్టచివరికి ఒక రాజు ఒప్పుకున్నాడు. ఆ రాజు పేరు విష్ణు. వీరభద్ర

రాజు విష్ణు నిర్ణయాన్ని మెచ్చుకున్నాడు. తరువాతి రోజునే యుద్ధం జరగాలని నిర్ణయించాడు.

ఆలోగా మిగతా రాజులంతా విష్ణు దగ్గరికి వచ్చి "ఒరేయ్, నీకు పిచ్చి పట్టినట్టు ఉంది. సింహాన్ని చూస్తే చాలు- ఎవరికైనా వణుకు పుట్టుకొస్తుంది. నువ్వు దానితో యుద్ధం చేసే సంగతి అటుంచు- అసలు దాన్ని చూశాక ప్రాణాలతో ఉంటావో లేదో" అని విష్ణును నిరాశపరచారు. విష్ణు వాళ్ల మాటలు పట్టించుకోకుండా నిశ్శబ్దంగా కూర్చొని వింటూ ఉన్నాడు.

తరువాతి రోజున యుద్ధం ప్రారంభించేముందు రాజు వీరభద్ర "విష్ణూ! సింహంతో యుద్ధంచేయటానికి నీకు ఏ ఆయుధం కావాలో కోరుకో" అని అడిగాడు.

విష్ణు నవ్వి 'నాకు ఒక నలుపు రంగు గుడ్డ కావాలి' అని అడిగాడు. రాజు ముందు కొంచెం ఆశ్చర్యపోయాడు గానీ, వెంటనే "సరే" అని విష్ణుకి ఒకపెద్ద- నలుపు రంగు గుడ్డను ఇచ్చాడు.

యుద్ధం మొదలయ్యింది. సింహాన్ని యుద్ధరంగంలోనికి దింపారు. విష్ణు తన నలుపు గుడ్డతో యుద్ధభూమిలోనికి దిగాడు. సింహానికి చాలా ఆకలిగా ఉంది. బోను తెరచిన వెంటనే అది విష్ణువైపు పరుగెత్తటం మొదలుపెట్టింది. దాన్ని తన దగ్గరికి రానిచ్చి, విష్ణు తన చేతిలో ఉన్న నలుపు రంగు గుడ్డను దాని కళ్ళపైన పడేట్లు గిరాటు వేశాడు. మరుక్షణంలో దానిపైకెక్కి, ఆ గుడ్డను దాని కళ్ళకి గట్టిగా కట్టేశాడు!

పాపం సింహానికి ఏమీ కనిపించలేదు- ఒక్క క్షణంలో దాని ప్రపంచం మొత్తం చీకటైపోయింది! ఇక అది అటూ ఇటూ ఎంత వేగంగా పరుగుతీసిందంటే, అటు పోయినా, ఇటు పోయినా అది ఆ యుద్ధరంగపు గోడలకి గుద్దుకుంది. పాపం! దాని తలంతా రక్తంతో తడిసిపోయింది. చివరికి విష్ణుకే దానిమీద జాలి వేసి, మెల్లగా దాని కళ్ళపైనుండి నలుపు గుడ్డను విప్పేసి, రక్తం వచ్చిన చోట కట్టాడు.

సింహంతో యుద్ధం చేసిన విష్ణునే తన సైన్యాధిపతిగా స్వీకరించాడు రాజు.

కాబట్టి ధైర్యం ఉంటే ఏదైనా సాధించవచ్చు.

**మెరుగే గదా?!** జోకు

పేషంట్: నా ఆరోగ్యం బాగైనట్లేగద, డాక్టరు గారూ?

డాక్టరు: ఓం.. మా బాగా మెరుగైందందండీ, పోయిన సారి బి.పి 130 అయితే, ఈ సారి 180 అయ్యింది!



# టింగరి బుల్లయ్య

*కొద్ది కొద్ది మార్పులతో రాష్ట్రమంతటా వినబడుతూంటుంది, ఈ కథ. బుడ్డోడు తన శక్తిని మంచి పనులకు ఉపయోగించక, వినాశనానికి ఉపయోగించటం వల్ల ఏం జరిగిందో చెప్పే ఈ కథ,అనంతపురం జిల్లా మాండలికంలో, మీకోసం-*

*సేకరణ, కథనం: ఎన్. సాయికుమార్, 8 వతరగతి, Z.P.H.S.వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.*

ఒక ఊరిలో బుడమకాయంత బుడ్డోడు ఉన్నాడంట. వానికి గురిగింజంత పెడ్లాం. వాళ్ళకి పుట్టగోసంత జొన్నతోట. ఆ జొన్నతోటలో చక్కని పంటంట. కానీ ఎప్పుడు చూసినా ఆ జొన్నతోటని గువ్వలు తినేస్తుండేవంట.

ఒక రోజు బాగా వాన వస్తుంది. ఆ రోజు సంతకి పోయినవాళ్ళంతా తడిసిపోయి వస్తుంటారు. కానీ బుడ్డోడు మాత్రం తడవలేదు. ఎందుకంటే వాడు తన బట్టల్ని విప్పేసి మరవబండ కింద పెట్టేంటాడు. తనూ ఆ బండకింద దూరింటాడు. వాన నిలిచిపోయిన తరువాత బట్టలు వేసుకున్నాడు.

అప్పుడు దావంటి దాసప్ప వస్తున్నాడు. దాసప్ప బుడమకాయంత బుడ్డోని చూసి, "మేమంతా నానిపోయినాము, వీడేమో నానిపోలేదు" అని బుడమకాయంత బుడ్డోని తాకి పోతాడు. దాసప్ప బుడమకాయంత బుడ్డోని తాకి పోయి, "ఏమన్నా నువ్వు తడిసిందేలేదు? ఆ రాసెం నాకూ చెప్పు" అంటాడు.

బుడమకాయంత బుడ్డోడు "నాకొక మంత్రం వచ్చు" అంటాడు. "ఆ మంత్రం ఏదో నాకు చెప్పన్నా" అంటాడు దాసప్ప.

"అలాగే చెప్పుతాను, మరి నువ్వు కూడా నాకొక మంత్రం చెప్పు" అంటాడు బుడ్డోడు.

" 'నాజొన్న తోటలో గువ్వలన్ని టింగరబుల్లయ్య' అను- నీ తోటలో ఉండే గువ్వలన్నీ చనిపోతాయి" అని ఒక మంత్రం చెప్పాడు దాసప్ప. "మరి నీ మంత్రం చెప్పు" అన్నాడు.

"వాన వచ్చినప్పుడు బట్టలు విప్పేసి మరవ బండకింద దూరుకో" అని చెప్తాడు బుడ్డోడు.

"ఓసి అంతేనా, నీ మంత్రం!" అని దావంటి పోతాడు దాసప్ప.

అప్పుడు బుడమకాయంత బుడ్డోడు సంతోషపడి పోయేసి, "నాజొన్న తోటలో గువ్వలన్నీ 'టింగరబుల్లయ్య'" అంటాడు. అప్పుడు గువ్వలన్నీ చనిపోతాయి. బుడ్డోడు వాటన్నిటినీ ఒక గంపలో వేసుకొని ఇంటికెళ్ళి, గురిగింజంత పెండ్లాంని పిలిచి మసాలాలు రుబ్బమంటాడు.



ఆమె మసాలు రుబ్బి , చారు చేసింటే, చాలా బాగా "గుమగుమా"వచ్చింటింది. ఇంక ఆగలేక, ఆమె గబగబ అందులోని ముక్కలన్నీ తినేసి, ఏమీ ఎరగనట్లు ఊరికే కూచొనింటింది. అంతలో వాడువచ్చి బువ్వ పెట్టమంటాడు. అప్పుడు ఆమె ఒట్టి 'పులుసు-పులుసు 'పోస్తుంది.

"ముక్కలేవి?" అంటే "నేను నీళ్లకి పోతే రెడ్డోరి పిల్లి వచ్చి తినిపోయింది" అని చెప్పుతుంది.

బుడ్డోడికి కోపం వచ్చి "రెడ్డోరి పిల్లి 'టింగరబుల్లయ్య ' " అంటానే రెడ్డోరి పిల్లి కాస్తా చనిపోయింటింది.

మళ్ళీ పోయి గువ్వలు పట్టుకొని వస్తాడు వాడు. ఈసారి కూడా ఆమే తినేసి, "కుక్క తినింది" అని


అపద్ధం చెప్తుంది- అప్పుడు బుడమకాయంత బుడ్డోడికి సంగతి అర్థమై- "నా పెండ్లాం 'టింగరబుల్లయ్య' " అంటాడు. వెంటనే వాని పెండ్లాం కాస్తా చనిపోయింది.



ఇప్పుడింక వానికి వంట ఎవరు చేసి పెట్టాలి? అందికని వాడు ఒక పెండ్లిలోకి పోయి, వానికి ఇష్టమొచ్చినట్లు రకరకాల తిండిపదార్థాలు తిని, వెంటనే "పెండ్లోల్లందరు 'టింగరబుల్లయ్య'" అన్నాడు. వెంటనే పెండ్లోల్లందరూ చనిపోయారు.

పెండ్లికొడుకు-పెండ్లి కూతురు వాని దగ్గరకు పరుగెత్తి కొట్టబోయారు. వెంటనే వాడు "పెండ్లికూతురు, పెండ్లికొడుకు 'టింగరబుల్లయ్య' " అన్నాడు- అదంటే వాళ్ళు కూడా చనిపోయారు.

అప్పుడు బుడమకాయంత బుడ్డోనికి కడుపులో విపరీతంగానొప్పి వచ్చింటింది. ఇంక చూసుకునేవాళ్ళు ఎవ్వరూ లేరని బాధగా కూడా ఉంటింది. చివరికి వాడు కాలే కాలే బండ మీద పడుకొని "నా కడుపు 'టింగరబుల్లయ్య' " అంటాడు- అంతే! వాడు కూడా చనిపోతాడు.








# నక్షత్ర కుమారి



*కథనం: V.P. ఆన్సీ, ఉపాధ్యాయురాలు, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.*

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు ఇరిట్టి. ఇరిట్టిలో ఒక ఇంట్లో ముగ్గురు పేద అక్కాచెల్లెళ్ళు నివసిస్తుండేవాళ్ళు. బట్టలు నేస్తూ, నూలు వడుకుతూ జీవనం గడుపుతుండేవాళ్లు వాళ్ళు.

ఒక రోజు ముగ్గురూ బట్టలు నేస్తూ ఆ సంగతీ- ఈ సంగతీ మాట్లాడుకుంటుండగా, పెళ్ళి ముచ్చట వచ్చింది, చర్చలోకి. అప్పుడు వాళ్లలో పెద్దామె "రోసి" అన్నది, "రాజు దగ్గర వంట చేసే వాడిని పెళ్ళి చేసుకుంటే ఎంత బాగుంటుందో! ఎప్పుడూ ఎంచక్కా మంచి మంచి వంటలు తినవచ్చు!" అని.

రెండో ఆమె 'సుచి' తన మనసులో మాట చెప్పింది: "రాజు దగ్గర బట్టలు కుట్టే దర్జీని పెళ్ళి చేసుకుంటే ఇంకా బాగుంటుంది. ఎంచక్కా కొత్త కొత్త రకాల మోడల్సులో బట్టలు కుట్టి వేసుకోవచ్చు!" అని.

అప్పుడు మూడో ఆమె 'సీమ' అన్నది కలల్లో తేలిపోతూ- "నేను గనక రాజుని పెళ్ళి చేసుకుంటే నాకు ఇద్దరు పిల్లలు పుడతారు- ఒక బాబు , ఒక పాప! బాబు చేతిలో యాపిల్ పండు ఉంటుంది. పాప నుదుటి మీద నక్షత్రం గుర్తుతో ఒక బొట్టు వుంటుంది" అని. ఈ ముచ్చట విని

అక్కలిద్దరూ గట్టిగానవ్వారు.

ఆ దేశపు రాజుగారు తనకు వీలైనప్పుడల్లా మారువేషంలో తిరిగి ప్రజల కష్ట సుఖాలను కనుక్కుంటూ ఉండేవాడు. సరిగ్గా ఈ అక్కా చెల్లెళ్ళు మాట్లాడుకునే సమయానికే రాజుగారు అటువైపు వచ్చి, వాళ్ల మాటలు విన్నాడు. తెల్లవారగానే ఆయన భటుల్ని పంపించాడు: పెద్దామె 'రోసి'కి వంటమనిషిని ఇచ్చి పెళ్ళి చేశాడు. రెండో అమ్మాయి 'సుచి'కి దర్జీని ఇచ్చి పెళ్ళి చేశాడు. మూడో ఆమె 'సీమ'ను తను పెళ్ళి చేసుకున్నాడు.

కొన్నాళ్ళకు అక్కా చెల్లెళ్లు ముగ్గురూ గర్భవతులయ్యారు. రాజుగారు భార్య 'సీమ'ను చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. ఇప్పుడు అక్కలిద్దరికీ తమ చెల్లి 'సీమ' అంటే చాలా కోపం పట్టుకున్నది. 'ఏదో ఒక విధంగా ఆమెను అక్కడి నుండి తరిమేయాలి' అనుకున్నారు. భార్య కాన్పు సమయం దగ్గర పడుతున్నది- అంతలోనే రాజుగారికి చాలా దూరప్రయాణం ఒకటి చేయాల్సి వచ్చింది. అక్కలిద్దరూ చాలా సంతోషించారు- తమ దుష్టపథకాలను అమలు పరచేందుకు 'ఇదే తగిన సమయం' అనుకున్నారు.

అంతలోనే సీమకు కానుపైంది. ఇద్దరు కవల పిల్లలు- ఒక బాబు, ఒక పాప- పుట్టారు ఆమెకు. సీమ చెప్పినట్టుగానే, పిల్లవాడి చేతిలో ఆపిల్ ఉంది. పాపకు నుదుటి మీద నక్షత్రం ఉంది!

అక్కలిద్దరూ కూడబలుక్కున్నారు- ఆ పసికందుల్ని తీసుకెళ్లి అడవిలో వదిలేసి వచ్చారు. ఆ పిల్లల స్థానంలో రెండు కుక్కపిల్లల్ని తెచ్చి పడుకోబెట్టారు.



ముర్రిపెంగా తన బిడ్డల్ని చూసుకునేందుకు వచ్చిన రాజు గారు ఖంగుతిన్నారు- "నా బిడ్డల్ని ఏం చేశావో చెప్పు!" అని ఆయన సీమను ఎంత అడిగినా సీమ ఏమీ బదులివ్వలేకపోయింది-

దాంతో ఆయనకు విపరీతమైన కోపం వచ్చింది. తక్షణమే ఆమెను బందీని చేసి కారాగారంలో పెట్టించారు.

ఇక అక్కడ, అడవిలో పడేసిన పసికందులు ఆకలికి ఏడ్వసాగారు. ఆ ప్రాంతంలో ఉన్న వన దేవత వాళ్లను చూసి జాలిపడి, తనతో తీసుకెళ్ళి పెంచుకున్నది. కాలం ఎవ్వరికోసమూ ఆగదు కదా, కొద్ది సంవత్సరాలు గడిచేసరికి వాళ్ళు కొంచెం పెద్దవాళ్ళయ్యారు.

రాజభవనానికి దగ్గర్లోనే అడవిలో ఒక పెద్ద ఇల్లు నిర్మించింది వనదేవత. ఆ ఇంట్లో పిల్లలిద్దరికీ కావల్సిన సామాన్లన్నీ తెచ్చి పెట్టింది. తనకు వీలైనప్పుడల్లా వచ్చి ఆ పిల్లలతో ఆటలాడుకొని పోతుండేది. పిల్లలిద్దరూ అడవిలో తిరుగుతూ, జంతువులతో ఆడుకుంటూ చాలా సంతోషంగా జీవించసాగారు.

అయితే వాళ్ళుండేది రాజభవనానికి దగ్గరే కదా, ఒక రోజున సీమ అక్కలిద్దరూ చూశారు వాళ్లని. నక్షత్రకుమారి నుదుటిమీద బొట్టును చూడగానే ఆమె ఎవరో తెలిసిపోయింది వాళ్లకు. 'వదిలించుకున్నాం గదా' అని ఇన్నేళ్ళూ నిశ్చింతగా ఉన్నారు వాళ్లు- ఇప్పుడు భయం వేయసాగింది. 'ఎలాగైనా వీళ్లిద్దరినీ చంపేయాల్సిందే' అనుకున్నారు.

ఇద్దరూ కలిసి, ఒక రోజున- అన్న లేని సమయం చూసుకొని వచ్చారు నక్షత్ర కుమారి దగ్గరికి. " మీ ఇల్లు చాలా బాగుందమ్మా! మీ అమ్మ వనదేవత ఎంత చక్కగా కట్టిపెట్టింది, దీన్ని! అయితే దీనిలో ఉండాల్సినవి ఇంకోరెండు ఉన్నాయి- ప్రవహించే నీళ్లు, మాట్లాడే పక్షి- ఆ రెండూ కూడా వుంటే మీ ఇల్లు ఎంత బాగుంటుందో!" అన్నారు.

'ప్రవహించే నీళ్లు, మాట్లాడే పక్షి' అనగానే నక్షత్ర కుమారికి ఉత్సాహం వచ్చింది: "ఇవన్నీ ఎక్కడ ఉంటాయి?" అని అడిగింది వాళ్లని.

"అయ్యో! మీ అమ్మ వనదేవత తలచుకుంటే ఏది సాధ్యం కాదు? నీ అన్నను పంపిస్తే తీసుకువస్తాడు . ఇదొక పనా?" అన్నారు వాళ్ళు నవ్వుతూ. మనసులో మాత్రం "వాటికోసం వెళ్ళినవాళ్ళెవ్వరూ తిరిగిరాలేదు- అట్లా వాడి పీడ కూడా విరగడౌతుంది. ఆ తర్వాత ఈ పిల్ల పని పట్టచ్చు సులభంగా " అనుకున్నారు.

అన్న రాగానే నక్షత్ర కుమారి వాడికి ఎదురువెళ్ళి, తన కోరికను వెల్లడించింది. ప్రవహించే నీళ్లను, మాట్లాడే పక్షిని తెచ్చిపెట్టమని బ్రతిమాలింది. 'సరేలే, దానిదేముంది, త్వరలో తెచ్చి పెడతాను చూడు!' అని చెప్పి ఆ పిల్లవాడు ముందుగా ప్రవహించే నీటి కోసం బయలుదేరాడు.

అయితే ప్రవహించే నీళ్లను తెచ్చుకోవటం

ఎట్లా? అవి ఏ గిన్నెలోనూ పట్టవు గదా? వాటిని వెతుకుతూ పోయిన పిల్లవాడికి అడవిలో ఒక చోట వింత అరుపులు, మూలుగులు, ఏడుపులు వినబడ్డాయి. వాడు వెళ్ళి చూసే సరికి, అక్కడ ఒక కొండచిలువ, కొన్ని పక్షి పిల్లల్ని గట్టిగా చుట్టుకొని, మ్రింగబోతున్నది! పిల్లవాడికి ఆ పక్షి పిల్లల్ని చూడగానే జాలి వేసింది. వాడు పరుగెత్తుకొని పోయి, తన కత్తితో కొండచిలువను గట్టిగా పొడిచాడు. ఆ దెబ్బతో కొండచిలువ పక్షి పిల్లల్ని వదిలేసి, వాడిని చుట్టుకున్నది. అయినా వాడు భయపడక, తన చేతులు దానికి అందకుండా ప్రహారం చేశాడు; చివరికి దాన్ని తుదముట్టించాడు.




వాడు కాపాడిన ఆ పక్షి పిల్లలు గండభేరుండాలు! తమ పిల్లల్ని కాపాడినందుకుగాను అవి వాడికి ప్రత్యుపకారం చేస్తామన్నాయి. ప్రవహించే నీటికోసం వెతుకుతున్నానని వాడు చెప్పగానే "అయ్యో! అవి నీకెందుకు నాయనా? అవన్నీమాట్లాడే పక్షిదగ్గర, రాక్షసుల సంరక్షణలో ఉంటాయి. మామూలు-వాళ్లకు అందేవి కావు అవి- మామాట విని వెనక్కి తిరిగి వెళ్ళు" అన్నాయి.

కానీ ఆ పిల్లవాడు పట్టిన పట్టు విడువలేదు. ప్రవహించే నీళ్లు, మాట్లాడే పక్షి రెండూ ఒకచోటనే ఉన్నాయని తెలిసి వాడు ఇంకా సంతోషపడ్డాడు- 'ఇప్పుడు తను రెండింటినీ ఒకేసారి సంపాదించవచ్చు!' చివరికి గండభేరుండాలు "సరే, నీ యిష్టం. నిన్ను అక్కడికి తీసుకెళ్ళటం వరకూ మేం చేయగలం- అటుపైన నీదే బాధ్యత" అని, వాడిని తమ వీపు మీద ఎక్కించుకొని, కొండలు , గుట్టలు, సముద్రాలు,నదులు అన్నీ దాటి పోయి, చివరికి వాడిని ఒక ద్వీపంలో వదిలాయి. "నీకు కావలసినవి ఉండేది ఇక్కడే. జాగ్రత్త. ప్రమాదాలనుండి ఎలా తప్పించుకుంటావో ఏమో- నీ పని అయ్యాక మమ్మల్ని తలుచుకుంటే చాలు- మేం వచ్చి నిన్ను వెనక్కి తీసుకెళ్తాం" అని చెప్పాయి.

అట్లా వెళ్ళిన అన్న ఎంతకూ తిరిగి రాలేదు! చాలా రోజులైంది- చివరికి నక్షత్రకుమారికి అనుమానం వచ్చింది- అన్న ఏదో ప్రమాదంలో ఇరుక్కొని ఉండచ్చుని. ఆమె ఇక

ఆగలేకపోయింది- అన్నకోసం బయలు దేరి వెళ్లింది. వాళ్లను సాకిన వనదేవతను కలుసుకొని, సంగతి అంతా వివరించింది- వనదేవత కొంతసేపు విని, దివ్యదృష్టితో చూసింది- "అయ్యో! నీ అన్న ఆ పక్షి మాయలో పడి అక్కడే శిలగా మారి పడి ఉన్నాడు. నువ్వు వెళ్ళు. మధ్యలో గండభేరుండాల సాయం తీసుకో. రాక్షసులు లేని సమయం చూసుకొని తెలివిగా పక్షిని పట్టుకొచ్చుకో. ఆ పక్షి ఈక తగిలితే అక్కడి శిలలన్నిటికీ ప్రాణాలు లేచి రాగలవు. అయితే ఒక సంగతి గుర్తుంచుకో- ఆ మాయ పక్షి ఏమి చెప్పినా నువ్వు నమ్మకు- తిరిగి ఏమీ మాట్లాడకు!" అని దీవించి పంపింది.

సరే అని, నక్షత్రకుమారి ముందుకు సాగింది. మధ్యలో గండభేరుండ పక్షులను వేడుకొని, వాటి సాయంతో మాట్లాడే పక్షి ఉండే ద్వీపాన్ని చేరుకున్నది. అక్కడ చాలా మంది రాక్షసులు కాపలా కాస్తున్న కోట కనబడింది ఆమెకు. వనదేవతను ప్రార్థించుకొని, ఆమె ధైర్యంగా ఆ రాక్షసుల ముందునుండి నడుచుకుంటూ కోటలోకి వెళ్ళింది. రాక్షసులు ఆమెను అడ్డుకునేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది.

లోపలికి వెళ్ళి చూసే సరికి, మాట్లాడే పక్షి కనబడింది- కోటలో స్వేచ్ఛగా తిరుగుతూ. ఈ పాపను చూడగానే అది మనిషిలాగానే ఇకిలిస్తూ "నువ్వెందుకు వచ్చావు ఇక్కడికి? మీ అమ్మ జైలులో ఉంది. జైల్లో పెట్టింది మీ నాన్న రాజే- ఇవన్నీ చేసింది మీ పెద్దమ్మలే!" అని పాడింది. పాపకు చాలా కోపం వచ్చింది- కానీ వనదేవత చెప్పింది కదా, "మాట్లాడకు" అని? -అందుకని ఆ పాప పిట్టకు ఏమీ బదులివ్వకుండా ముందుకు పరుగెత్తింది. క్షణంలో ఆ పక్షిని పట్టుకొని, అది ఇక నోరు తెరవకుండా ఒక పట్టీ వేసేసింది.



అటుపైన ఆ పక్షి ఈకను ఒకదాన్ని తీసుకొని అక్కడ ఉన్న బండలకు తగిలించింది. వెంటనే అక్కడి బండలన్నీ మనుషులుగా మారిపోయారు! బయట కాపలా కాస్తున్న రాక్షసులంతాకూడా, తమను కమ్మిన మాయాజాలం విడిపోయినట్లు, తక్షణం మాయమైపోయారు. నక్షత్రకుమారి వాళ్లందరికీ మాట్లాడవద్దని సైగ చేసి, అందరినీ వెంట బెట్టుకొని తిరిగి తమ అడవికి చేరుకున్నది.

అప్పుడు వనదేవత మాట్లాడే పక్షి బంధాల్ని విడిపించి, దాని దుష్టశక్తులన్నిటినీ నిర్మూలించింది.

అటుపైన ఆమె దాన్ని బుజ్జగిస్తూ "నీ శక్తుల్ని చెడుకోసం కాక అందరికీ మేలు చేసేందుకు వాడు" అని చెప్పింది.

మంచిగా మారిన పక్షి అందుకు అంగీకరించి, నక్షత్ర కుమారితో "పాపా! మీ తండ్రి మహారాజు. మీ పెద్దమ్మలను నమ్మి, మిమ్మల్ని చంపిన నేరాన్నే మోపి, మీ అమ్మను జైల్లో పెట్టాడు. నీకు లేని పోని ప్రలోభాన్ని కల్పించి, నన్ను వెతికే సాకుతో మీఅన్నను చంపాలని ప్రయత్నించింది కూడా మీ పెద్దమ్మలే. మనందరం కలిసి వెళ్దాం; మీకోసం అక్కడ మీ అమ్మ కలవరించని రోజు లేదు" అన్నది.

పిల్లల్ని చూడగానే గుర్తు పట్టారు రాజుగారు. చెయ్యని నేరానికి ఇన్ని సంవత్సరాలుగా జైలుశిక్ష అనుభవించిన రాణి దగ్గరకు వెళ్లి క్షమాపణ కోరారు. ఇంత చెడు పని చేసినందుకుగాను "రోసి, సుచి" లను పట్టుకుందామని చూస్తే వాళ్ళు ఆ సరికే ఎక్కడికో తప్పించుకున్నారు!

అటుపైన అందరూ సంతోషంగా జీవించారు.



**సినీ మాయ!**

జోకు

స్కూల్లో సార్ పని చెప్పారు. ఒక పిల్లవాడు పని చేసి ఉండడు. అప్పుడు-
సార్ : ఎందుకు రా నీవు వర్క్ చేయలేదు?
పిల్లవాడు : నలుగురికి నచ్చినది నాకసలే నచ్చదురో (అని పాట పాడుతాడు)
సార్: (చెంపకి ఒకటి కొడతాడు)
పిల్లవాడు : అబ్బనీ తియ్యని దెబ్బ (అని పాట పాడుతాడు)
సార్ : నీకు ఇట్లా కుదరదు- హెడ్ మాస్టర్ దగ్గరకు రా!
పిల్లవాడు : వస్తానీవెనుక- ఏదైనా కాదనకా (అని పాడుతాడు)
( హెడ్ మాస్టర్ దగ్గర )
హెడ్ మాస్టర్ : (ఆ పిల్లవాన్ని కొట్టి) వీడిని చీకటి గదిలో పెట్టండి!
పిల్లవాడు : (చీకటి గదిలో) మసక మసక చీకటిలో మల్లె తోట వెనకాల (అని పాడుతాడు)
( ఆ గదిలో చాలా గట్టిగా పాడుతూ ఉంటే ఉపాధ్యాయులు వినలేక వాకిలి తెరుస్తారు. పిల్లవాడు బయటికి వచ్చి )
పిల్లవాడు : తెల్లారిందోయ్ మామ మామ!
( ఆ పిల్లవాడి అల్లరి భరించలేక T.C ఇచ్చి పంపిస్తారు. )
పిల్లవాడు : ( అందరితో ) వెళుతున్నా వెళుతున్నా మౌనంగా వెళుతున్నా వెళ్ళాలని లేకున్నా మౌనంగా వెళుతున్నా (అని పాడుతూ వెళ్ళిపోతాడు)



# 'అదే నేనైతేనా...?'

రచన:శ్రీమతి ఆదిలక్ష్మి, నంద్యాల, కర్నూలు జిల్లా.

నవీనపురం ఉన్నత పాఠశాల మైదానం-

ఫుట్ బాల్ మ్యాచ్ జరుగుతోంది.

రెండు జట్లూ హోరాహోరీగా ఆడుతున్నాయి.

ప్రేక్షకులు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

అంతలో ఓ జట్టులోని ఆటగాడు గోలు చేశాడు. ఆవరణంతా చప్పట్లుతో మారుమోగి పోయింది.

"వావ్! అద్భుతమైన గోలు కదూ! ఆట మొదలయ్యాక పావుగంటకి చేసాడు!" మెచ్చుకోలుగా అన్నాడు ఆనంద్!

"ఓస్! ఇదీ గొప్పేనా? అదే నేనైతేనా!? రెండు నిముషాల్లో గోలు చేసేవాడిని!" గొప్పగా అన్నాడు రమేష్!

వాళ్ళిద్దరూ తొమ్మిదో తరగతి చదువు తున్నారు. రమేష్ మాటలు విని ఆనంద్ తో పాటు వాళ్ళ క్లాస్‌మేట్లు కూడా ముఖముఖాలు చూసుకున్నారు.

~~~~~~~~~

ఆదివారం ఉదయం. నరేష్ మార్కెట్ కు బయలు దేరాడు. అమ్మకూరలు తెచ్చి పెట్టమంది
~~~~~~~~~

మరి! వేగంగా వెళ్తున్న నరేష్‌కి రమేష్ ఎదురయ్యాడు.

"హాయ్ నరేష్! మార్నింగ్ షోకి వెళ్దాం, వస్తావా?" అన్నాడు.

"లేదు రా! అమ్మ మార్కెట్ కెళ్ళి రమ్మంది. కూరలు కొనుక్కుని ఇంటికెళ్ళే సరికే గంటన్నర పడుతుంది. టైమ్ చాలదు" నరేష్ చెప్పాడు.

"గంటన్నరెందుకు రా! అదే నేనైతేనా? అరగంటలో పూర్తి చేస్తాను" తలెగరేసాడు రమేష్!

~~~~~~

సాయంత్రం స్కూల్ అయిపోయాక అందరూ ఇళ్ళకి బయలు దేరారు.

"ఒరేయ్! నిన్న మా బాబాయి ఊరి నుండి వచ్చాడు. ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మానాన్న పాత బైకు మూలన పెట్టేసాం చూడు! అది తుప్పెక్కి ఉంది. దాన్ని ఏ పార్టుకా పార్టు విప్పి, శుభ్రం చేసి, పోయిన పార్టులన్నీ వేసి రిపేర్ చేసాడు. మొత్తం ఒక్కపూటలో చేసేసాడు తెలుసా? ఇప్పుడది కొత్త బైకులా ఉంది!" సంతోషంగా చెప్పాడు రమణ.

"ఓస్! అదీ గొప్పేనా!? అదే నేనైతేనా! ఒక్క గంటలో బాగు చేయగలను" ఠక్కున అన్నాడు రమేష్.

చుట్టూ ఉన్న పిల్లలందరికీ వళ్ళు మండి పోయింది. అందరూ కలిసి రమేష్ కి గట్టిగా బుద్ధి చెప్పాలను కున్నారు.

ఓ పదిరోజుల తర్వాత వాళ్ళందరికీ సంక్రాంతి సెలవులొచ్చాయి. ప్రక్క ఊరి దేవాలయం దగ్గర జరిగే జాతరకి క్లాస్ మేట్లు అందరూ కలిసి వెళ్ళారు.



మిఠాయి అంగళ్ళు, దుస్తుల దుకాణాలూ, బొమ్మల కొట్లూ... జెయింట్ వీల్, రంగుల రాట్నాలూ... ఒకటే హడావుడి... ఎటు చూసినా జనమే! కోలాటాలు, డప్పు డాన్సులూ, తప్పెట గుళ్ళు, చెక్కభజనలు! భలే హుషారుగా ఉంది పిల్లలకి.

తెచ్చుకున్న డబ్బులతో ఇష్టమైనవి తిన్నారు, నచ్చినవి కొన్నారు. చెరుకు రసాలు జుర్రుకున్నారు. రంగుల రాట్నాలెక్కి గిర్రున తిరిగారు. నవ్వులూ కేరింతలతో హుషారుగా జాతరంతా తిరిగేసారు.

సాయంత్రానికి అంతా తిరుగు ప్రయాణ
~~~~~~

మయ్యారు. గమనించుకుంటే తమ గుంపులో రమేష్ కనబడలేదు. జాతరలో ఎప్పుడో తమ నుండి వేరుపడిపోయాడని మిగిలిన వాళ్ళకి అర్థమైంది. కంగారుగా అంతటా వెదికారు. అంతమంది జనంలో, హడావిడిలో, ఎవరికెవరని? ఎక్కడా రమేష్ కనబడలేదు. వాళ్ళనీ వీళ్ళనీ అడిగారు. ఎవరూ ఆచూకీ చెప్పలేదు.

చివరికి మైకులో ప్రకటనలిచ్చే చోటుకు వెళ్ళి, రమేష్ పేరూ ఊరూ వివరాలు చెప్పి, ప్రకటన ఇప్పించారు. ఎంత సేపు ఎదురు చూసినా, చీకటి పడింది గానీ, రమేష్ జాడలేదు.

ఇక చేసేది లేక ఆనంద్, నరేష్, కార్తీక్ తదితరులంతా, తమ ఊరికి బయలు దేరారు. అప్పటికి బాగా చీకటి పడటంతో ఆటోలు కూడా లేవు. అయినా 'పదిమందిమి ఉన్నాం, ఆరు కిలోమీటర్లే కదా' అనుకొని, కబుర్లు చెప్పుకుంటూ నడవ సాగారు.

అల్లంత దూరంలో రమేష్ రోడ్ ప్రక్కన పడిపోయి కన్పించాడు. స్పృహలో లేడు. మిత్రులందరూ ఆందోళన పడి, రమేష్ ముఖం మీద నీళ్ళు చల్లి, సేద తీర్చారు. కళ్ళు తెరిచిన రమేష్ మంచినీళ్ళు తాగి కాస్త స్థిమితపడ్డాడు.

"ఏమైందిరా? ఎక్కడి కెళ్ళావు?" అందరూ ఒకేసారి కంగారుగా అడిగారు.

"ముందు ఇళ్ళ కెళ్దాం. రేపు తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నాడు ఆనంద్. రమేష్ కి తన చేతిలోని తినుబండారా లిచ్చాడు. పళ్ళిచ్చాడు నరేష్. అవి తిని కాస్త తేరుకున్నాడు రమేష్ . వేగంగా నడిచి ఇళ్ళు చేరారంతా!

మర్నాడు రమేష్‌కి ఏమైందని మళ్ళీ అడిగారు.

"అది కాదురా! మనం జయింట్ వీల్ దిగాక చూసుకుంటే, మీరంతా కనబడలేదు. మిమ్మల్ని వెదుకుతూ మరో వైపు వెళ్ళినట్లున్నాను. ఎంత సేపు వెదికినా ఎవరూ కనబడలేదు. హడావుడిలో చూసుకుంటే నా జేబులో డబ్బులు లేవు. ఎంత ఏడుపొచ్చిందో! ఆకలి వేసింది. ఏమైనా తిందామంటే జేబులో రూపాయి కూడా లేదు. ఆటోకి కూడా డబ్బుల్లేక, నడుచుకుంటూ మన ఊరికి బయలు దేరాను.

వస్తుంటే దారిలో..." చెప్పటం ఆపాడు రమేష్. భయంతో అతడి వళ్ళు వణుకుతోంది.

"ఏమైందిరా! భయం లేదు చెప్పు" అన్నారు మిత్రులు.

"దారిలో దొంగ ఎదురయ్యాడు. కత్తి చూపించి "జేబులో డబ్బులన్నీ ఇవ్వు" అన్నాడు. నా జేబులో డబ్బుల్లేవని చెబితే నమ్మలేదు-సరికదా, "అబద్ధాలాడతావా? బుర్ర బద్దలు కొడతా" అంటూ చెయ్యెత్తాడు. భయంతో చెమటలు పోసాయి. వదిలెయ్యమని దండం పెట్టా.

గుడ్లురిమాడు- అంతే గుర్తుంది! కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా మీరున్నారు. మీరే రాకపోతే నేనేమై పోయేవాడినో" ఇప్పటికీ భయంతో వణుకుతూ అన్నాడు రమేష్!

"అదేంటిరా! అక్కడున్నది నువ్వు కదా- 'అదే నేనైతేనా, ఏదైనా చెసెయ్య గలను!' అంటావుగా!? ఒక్క మామూలు దొంగ ఎదురయ్యేసరికే, భయపడి స్పృహ తప్పి పడిపోయావా?" రమేష్‌ని నిశితంగా చూస్తూ అన్నాడు ఆనంద్!



బిక్కముఖం వేసాడు రమేష్!

"అవున్రా! 'అదే నేనైతేనా-' అంటూ ఎవరినైనా ఎగతాళి చేసేవాడివి కదా! ఆ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో ఒక్క ఐడియా కూడా రాలేదా?" నరేష్ అన్నాడు.

"ఆలోచిస్తే ఎన్ని మార్గాలు లేవు? మైకు దగ్గరికెళ్ళి 'మమ్మల్ని వచ్చి కలుసుకొ'మ్మని ప్రకటన ఇప్పించవచ్చు; మన ఊరి వాళ్ళు ఇంకా చాలామందే వచ్చి ఉంటారు కదా, జాతరకి? వాళ్ళెవరైనా కన్పిస్తారేమోనని వెతికి, నీ పరిస్థితి చెప్పి, డబ్బు అప్పు తీసుకోవచ్చు, సాయం అడగ వచ్చు!" రమణ అన్నాడు.

"అంతే కాదురా! మన ఊరి వాళ్ళు కొందరు, జాతరలో అంగళ్ళు పెట్టారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి, విషయం చెప్పి, సాయం అడగాల్సింది కదా!" మహేష్ అన్నాడు.

"ఆ ఆలోచనలేవీ రాలేదురా?" బేలగా చూస్తూ అన్నాడు రమేష్.

"పోనీ! ఒంటరిగా గాకుండా, నలుగురితో కలిసి మన ఊరికి బయలు దేరాల్సింది!" మందలిస్తున్నట్లుగా అన్నాడు శ్రీకాంత్.

"సరే ఇవేవీ కాదు- 'అదే నేనైతేనా!' అనుకుంటూ... దొంగని- సినిమా హీరో మాదిరి- ఈడ్చి ఒక్కటి తన్నాల్సింది!" అన్నాడు ఆనంద్.

ఒక్కసారిగా అందరూ ఘొల్లున నవ్వారు.

రమేష్ సిగ్గు పడ్డాడు. "సారీ రా! ఇప్పుడు నాకు అర్థమైంది. ఏపనైనా చెయ్యటం కష్టం- మాటలు రువ్వడం చాలా తేలిక. అది గ్రహించకుండా అందర్నీ తక్కువ చేసి మాట్లాడాను. ఇక నుండి అలా ప్రవర్తించను" అన్నాడు నిజాయితీగా.

"శభాష్! తప్పు తెలుసుకోవటం, సరిదిద్దుకునే ప్రయత్నం చెయ్యటం మంచి లక్షణం. పొరపాటు మానవ సహజం" అన్నాడు దొంగ! హఠాత్తుగా దొంగ ప్రత్యక్షమయ్యే సరికి రమేష్ బిత్తర పోయాడు.

అతడి అయోమయం చూసి అందరూ మరోసారి నవ్వారు.

రమణ, రమేష్ భుజం మీద చెయ్యేసి "సారీ రా! నీకు వాస్తవం తెలియ జెప్పాలని, మేమంతా కలిసి మా బాబాయి చేత దొంగ వేషం వేయించాము. ఎవరైనా ఏదైనా పని చేస్తుంటే 'ఓస్! అదెంత?' అనటం తేలిక. స్వయంగా మనం చేసినప్పుడే వాస్తవం తెలిసి వస్తుంది. అందుకే అలా చేసాం. అంతే గానీ, నిన్ను నొప్పించాలని కాదు. మొదట నువ్వు తప్పిపోయినందుకు కంగారు పడ్డాం. తర్వాత మైకులో ప్రకటన ఇప్పించాం. నువ్వు రాలేదు. 'సరే' అని నీ కోసం వెదుకుతుంటే, నువ్వు అప్పటికే మన ఊరి దారిపట్టి కనిపించావు. అప్పుడే ఈ ఐడియా వచ్చింది. బాబాయి దొంగలా నటించి నిన్ను కాసేపు కంగారు పెట్టాడు. అంతే!"అని వివరించాడు రమణ.

"థ్యాంక్యూ బాబాయ్. నిజంగా మీరు నా కళ్ళు తెరిపించారు" మనస్ఫూర్తిగా అన్నాడు రమేష్.

తర్వాతెప్పుడూ రమేష్ "అదే నేనైతేనా!" అనలేదు. అతడిలో వచ్చిన మార్పుకి అందరూ ఎంతో సంతోషించారు.

**జోకులు**

**ఎవరి పాలు?**

తల్లి: (కోపంగా) బంగారం లాంటి పాలురా, ఊరికే పిల్లి పాలు చేశావే!


కొడుకు: అవి గేదె పాలు కదమ్మా, పిల్లి పాలు కావుగా?!.

డాగ్‌కుక్క!

రాము: ఒరేయ్, సోము వాళ్ళ యింట్లో ఉండే కుక్కంటే నాకు చాలా భయంరా!

రవి: నీకేమో వాళ్ళకుక్కంటే భయం, నాకేమో వాళ్ళ డాగ్ అంటే భయం!

*సేకరణ: విశ్వనాథ్, ప్రకృతిబడి.*




# ఏనుగు కష్టాలు

*మూలకథనం: పర్తాప్ అగర్వాల్,     తెలుగు అనుసరణ: నారాయణ*



అనగా అనగా ఒక ఊరు ఉండేది. ఊరు చుట్టూ అడవి. అడవిలో చాలా ఏనుగులు ఉండేవి. ఎండాకాలం, అడవిలో ఒక ఏనుగుకు మేత సరిగ్గా దొరకలేదు. పాపం బాగా ఆకలి అయినట్లుంది, ఊళ్ళోకి జొరబడింది- ఏమైనా తినేందుకు దొరుకుతుందేమోనని. అయితే అట్లా తినేందుకు ఏదైనా దొరికేలోపుగానే, ఒక తియ్యని సువాసన దాని ముక్కుపుటాలను ఘాటుగా తాకి, దాని నోరు ఊరించింది.


ఏనుగు ఆ వాసనను పట్టుకొని నడుచుకుంటూ పోయింది. ఊళ్ళో మిగతా ఇళ్ళకు కొంచెం దూరంగా, ఎడంగా ఉన్న పూరి గుడిశె ఒకటి దాని ముక్కును ఆకర్షించింది. సువాసన ఆ గుడిశె లోంచే వస్తున్నది. గుడిసె కూడా ఏమంత గట్టిగా లేదు. గోడకున్న రంధ్రం లోంచి తలను లోపలికి దూర్చి చూసింది ఏనుగు. తొండాన్ని గుడిసె లోపలికంటా జొనిపి, వాసన ఎక్కడినుండి వస్తున్నదో కనుక్కున్నది.

ఆ పాకలోనే ఒకడు దొంగతనంగా నాటు సారాయి తయారు చేస్తుంటాడు. గుడిసెలో మూలగా ఉంచిన కుండలోని సారాయి వాసనే, ఏనుగును ఆకర్షించింది! అట్లా ఆ ఏనుగు బయటినుంచే తన తొండాన్ని కుండలోకి ముంచి, ఒక్క దెబ్బకు కుండను పూర్తిగా ఖాళీ చేసింది.

అట్లా కడుపునిండా నాటు సారాయి తాగటంతో దాని దాహం తీరింది- ఇప్పుడు దానికి రెండింతలు ఆకలి మొదలైంది.

నిజానికి ఖాళీ కడుపుతో, తొందర తొందరగా సారాయి త్రాగటం ప్రమాదం. అంత పెద్ద ఏనుగూ ఆ నాటు సారాయి దెబ్బకు తట్టుకోలేకపోయింది. కడుపు నిండా సారాయినె పెట్టుకొని, అది అట్లా అట్లా తూలుకుంటూ నడిచిపోయింది. ఒక కిలోమీటరు కూడా పోకనే, సారాయి దెబ్బకు నేలమీద బారున పడిపోయింది. పడిపోయిన మరుక్షణం అది స్పృహ తప్పింది, ఇక కదలక మెదలక అలాగే పడి ఉండిపోయింది.

తెల్లవారేసరికి, చనిపోయిన ఏనుగు గురించిన వార్త గ్రామంలో దావానలంలా వ్యాపించింది. ఏనుగు మృతికి కారణమైన దొంగసారా తయారీదారుడు తన సామాన్లన్నీ ఎత్తుకొని నిశ్శబ్దంగా పరారయ్యాడు. మిగిలిన గ్రామస్తులందరూ చచ్చిపోయిన ఏనుగు చుట్టూ గుమిగూడి, ఆ ఏనుగు ఎవరి స్థలంలోనైతే చచ్చి పడి ఉన్నదో ఆ రైతును ఓదార్చేందుకు ప్రయత్నించసాగారు: ఎందుకంటే, ఏదైనా అడవి జంతువు ఒకవేళ దానంతట అదే నీ పొలంలోకి వచ్చి చచ్చిపోయినా సరే, 'దాన్ని నువ్వు చంపలేదు' అని నిరూపించుకునే బాధ్యత నీదే- నీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోనంత వరకూ నువ్వు దోషివే! అటవీ శాఖ అధికారులు, పోలీసులు నిన్ను వేధించుకు తింటారు! ఈ సందర్భంలో మాత్రం గ్రామస్తులందరూ కలిసి తీర్మానించుకున్నారు- రైతు అమాయకుడు- తమలోఒకడు- అతనిని ప్రభుత్వ అధికారులకు అప్పగించి ఊరుకునే ప్రశ్నే లేదు.



అటవీ శాఖ అధికారి తన అనుచరులను వెంట బెట్టుకొని సంఘటనా స్థలికి వచ్చాడు. పరిస్థితిని మొత్తం సమీక్షించాడు. గ్రామస్తులతో వివరంగా చర్చించాడు. చివరికి అతను అన్నాడు-"నేను ఈ రైతు మీద ఏ కేసూ పెట్టను. ఏలాంటి విచారణా లేకుండా ఇతన్ని విడిచిపెట్టేస్తాను". చాలా దయగల అధికారి అన్నమాట- అయితే ఒక షరతు- గ్రామస్తులందరూ ఆయనతో ఒక ఒప్పందానికి

రావాల్సిఉంటుంది:

ఆ అధికారి ఈ ఏనుగు మృతిని 'సహజ మృతి'గా ధృవీకరిస్తాడు- ఆ ఏనుగు శరీరాన్ని పూడ్చి పెట్టేందుకు గాను గ్రామస్తులు పెద్ద గొయ్యి తవ్వాలి. అలా గొయ్యి త్రవ్వినందుకు గాను ఆ అధికారే వాళ్ళకు వెయ్యి రూపాయలు ఇస్తాడు- కానీ అసలు కిటుకు ఏంటంటే- ఏనుగు శవాన్ని పూడ్చిపెట్టేముందుగా దాని దంతాలు రెండింటినీ అతను తీసేసుకుంటాడు- ఈ రకంగా అందరికీ లాభమే! ఎలాగుంది?

గ్రామస్తులందరూ ఒప్పుకున్నారు.

అయితే ఇదంతా అయ్యేసరికి సూర్యాస్తమయం అయిపోవచ్చింది. అటవీ శాఖాధికారి దయగలవాడు; మాట మీద నిలబడేవాడు కూడాను- తను ఇస్తానన్న వెయ్యిరూపాయలూ ఆయన గ్రామస్తులకు ఇచ్చేశాడు. ఏనుగు దంతాలు దెబ్బతినకుండా కోసేందుకు కొంత సామగ్రి అవసరం ఉంది- ఆయన ఆ సామాన్లు తీసుకొని మరునాడు ఉదయమే వస్తానన్నాడు. ఆయన వచ్చేసరికి గ్రామస్తులు తమవంతు పనీ పూర్తిచేసి ఉండాలి. ఆయన రాగానే, ఏనుగు దంతాలు తీసెయ్యగానే ఏనుగు శరీరాన్ని పూడ్చిపెట్టెయ్యొచ్చు.

గ్రామస్తులంతా ఆసరికి బాగా అలిసిపోయారు. తమకు వచ్చిన వెయ్యి రూపాయలతోమంచి పార్టీ చేసుకుందామని నిర్ణయించుకున్నారు అందరూ. పాటలు, సారాయి, నాట్యాలతో రాత్రంతా పెద్ద హంగామా జరిగింది. తెల్లవారు జామున, ఇంకా నిద్ర కళ్లతోటే గ్రామస్తులంతా పారలు, పికాసులు, తట్టలు, తాళ్లు తీసుకొని, తాము గుంత తవ్వవలసిన ప్రదేశానికి బయలుదేరి వెళ్ళారు.

ఆలోగా మన ఏనుగుకు తెలివొచ్చింది. అది ఇంతసేపూ పడి ఉన్నది సారాయి మత్తులోనే! ఆ సంగతి తెలీక, అది చచ్చిపోయిందనుకున్నారు అందరూ! అది మెల్లగా కదిలి, తన తల ఎత్తి, కాళ్ళు నాలుగూ జాడించి, బరువైన తన శరీరాన్ని రెండు మూడు సార్లు విరుచుకొని, తూలుతూనే లేచి నిలబడ్డది. ఇంకా మసక మసక గానే, మత్తుగానే ఉంది అది- తలవిదిలించి చూసేసరికి- జనాలు దాని దగ్గరికి వస్తుండటం కనబడింది! అకస్మాత్తుగా దాని మత్తు మొత్తం వదిలిపోయింది! ఒక్కసారి బిగ్గరగా అరిచి, వాళ్ళమీదికి దూకుతున్నట్లు ఒక్క గెంతు గెంతిందది. నిద్రకళ్ళతో జోగుతూ వస్తున్న గ్రామస్తులు ఒక్కదెబ్బకు కకావికలయ్యారు. ఏనుగు ఉన్న దిక్కును వదిలి మిగిలిన అన్ని దిక్కుల్లో దేన్నీ వదలకుండా పరుగులు పెట్టారు. అందరూ పారిపోయారనీ, తనకి ఇక ప్రమాదం లేదనీ అర్థం అయ్యాక ఏనుగు మరోసారి బిగ్గరగా అరిచి, వెనక్కి

తిరిగి అడవిలోకి వెళ్ళిపోయింది- తన ప్రశాంత జీవితాన్ని కొనసాగించుకునేందుకు.

"చచ్చిపోయిన ఏనుగు తిరిగి ఎలా లేచి నిలబడింది?" ధైర్యం కూడగట్టుకుని మళ్ళీ ఒకచోట సమావేశమైన గ్రామస్తులకు ఈ సంగతి అర్థమయ్యేందుకు చాలా సేపే పట్టింది. ఆలోగా అటవీ శాఖాధికారి గారు విచ్చేశారు- తన సామాన్లన్నీ వెంటబెట్టుకొని. గ్రామస్తులు ఆయన చుట్టూ చేరి, తమకు అర్థమైన 'సారాయి త్రాగి పడిపోయిన ఏనుగు' కథను ఆయనకు వివరించేసరికి, ఏనుగు దంతాలతో తన పంట పండిందనుకొని ఆయన నిర్మించుకున్న ఆశల సౌధం మొత్తం కుప్పకూలింది. ఇప్పుడాయనకు తన వెయ్యి రూపాయలు వెనక్కి వస్తే చాలు!

గ్రామస్తులు నవ్వారు- "మేం కూడా మీ వెయ్యి రూపాయల్ని తాగేశాం సార్!" అన్నారు, ఆఫీసరు గారికి ధన్యవాదాలు చెప్పి ఇకిలిస్తూ.

జోకులు

**వృత్తి సమస్య!**

డాక్టరుగారు రేడియోలో చెబుతున్నారు: వృత్తి పరంగా వచ్చే ఆరోగ్య సమస్యలు అనేకం ఉంటాయి- ఉదాహరణకు, టీవీ యాంకర్లకు ఒళ్ళు వంకర్లు తిరిగిపోవటం.. ఇది చాలా సహజం. దీనికి మందులు వాళ్ళు వాళ్ళ వృత్తుల్లోనే వెతుక్కోవాలి. ..

టీచర్ : గోపి! పర్యావరణానికి వాతావరణానికి తేడా ఏమిటిరా?

గోపి: కారణం తెలియదు కానీ రెంటింకి రణాలున్నాయి సార్.

*సేకరణ: బి.పావని*

**సువాసన నీళ్ళు!**

హోటల్ లో-

కస్టమర్ : నీళ్ల గ్లాసు కంపుకొడుతోంది చూడు!

సప్లయర్ : రేపటి నుండి సెంట్ పూసి యిస్తాను గాని టిప్పు ఘనంగా ఇవ్వండి సార్!

*సేకరణ: జయ దుర్గ*



# కూర్చోవాలా, పడుకోవాలా?

మూలం: బుద్ధిస్టు పారాబుల్సు తెలుగు అనుసరణ: నారాయణ

జపాన్‌లోనూ, చైనాలోనూ బహుళంగా విస్తరించిన బౌద్ధ శాఖల్లో "జెన్" శాఖ ఒకటి. జెన్ గురువులు జీవన విధానాన్నీ, తాత్విక దృష్టినీ మిళితం చేసి, "సూటిగా" చూడటాన్ని నేర్పించేవాళ్ళు, శిష్యులకు.

అనగా అనగా చాలా రోజులక్రితం అలాంటి ఒక గొప్ప జెన్ గురువుగారు ఉండేవారు. ఆయన "అత్యంత మెలకువతో కూడిన ధ్యానం" ఒకదాన్ని సాధన చేస్తుండేవాడు- అంటే ఎప్పుడూ మెలకువతో ఉండాలని ప్రయత్నించేవాడన్నమాట. అయితే ఎవరైనా పడుకొని నిద్రపోయేటప్పుడు "మెలకువ"తో ఎట్లా ఉంటారు, ఉండలేరు కదా? అందుకని, ఆయన కూర్చొనే నిద్రపోవటం సాధన చేశాడు. ఎప్పుడూ కూర్చొనే ఉండేవాడు, చకిలంమొకిలం (బాసింపట్లు) వేసుకొని- ఎప్పుడోగాని నిద్రకూడా పోయేవాడు కాదు. రోజంతా సీరియస్‌గా కూర్చొని ధ్యానమే చేస్తూ ఉండేవాడు. అట్లా చేస్తే తప్ప విముక్తి లభించదని నమ్మేవాడు మరి!

ఆయనకు బుద్ధి చెప్పాలనుకొని, బోధిసత్త్వుడు స్వయంగా ఆయనకు శిష్యుడిగా వచ్చి చేరాడు. వచ్చినప్పటినుండీ ఆ శిష్యుడు

విపరీతమైన బద్ధకాన్ని ప్రదర్శించటం మొదలుపెట్టాడు. రోజూ ప్రొద్దునే ప్రార్థన సమయాన్ని సూచించే గంట మ్రోగిన తర్వాత కూడా వాడు పడక దిగేవాడు కాదు. అరగంట గడిచినా ఇంకా ముసుగుతన్ని పడుకొనే ఉండేవాడు. గురువుగారికి ఈ సంగతి తెలిసి చాలా కోపం వచ్చింది.



శిష్యుడిని పిలిపించి గట్టిగా కోప్పడ్డారు: "నువ్వు నా శిష్యుడిగా చేరావు సరే- కానీ రోజంతా పడుకొని నిద్రపోతూ ఇంత బద్ధకంగా ఎందుకుంటున్నావు? ఇక్కడి ప్రవర్తనా నియమావళి ఏం చెబుతున్నదో నీకు అర్థం కాలేదా? "గంట మ్రోగిన తర్వాతకూడ నిద్రలేవక, పడక దిగనివాడు తదుపరి జన్మలో పాముగా పుట్టి, తన బద్ధకానికి తగిన ఫలితాన్ని అనుభవిస్తాడు" అని అంత సూటిగా చెప్పామే?" అని.


శిష్యుడు జవాబిచ్చాడు- "గురువుగారూ! ఎప్పుడూ పడుకొనీ, పడుకొనీ ఉంటాను గనక వచ్చే జన్మలో నేను పాముగా పుడతానని శలవిచ్చారు తమరు- మరి తమ మాటేమిటి? ఎప్పుడూ కూర్చొనీ-కూర్చొనీ తమరు వచ్చే జన్మలో కప్పగా పుట్టాలి- అంతేగా?" అని.

గురువుగారు క్రిందికి వంగి ఒక ఇటుకను చేతులోకి తీసుకొన్నారు- ఇంకొక బండతో దాన్ని పాలిష్ చేయటం మొదలు పెట్టారు. శిష్యుడు కొంతసేపు చూసి "ఏం చేస్తున్నారు?" అని అడిగాడు.

"ఈ ఇటుకను సానపట్టి అద్దంలాగా చేయాలని చూస్తున్నాను- కానీ ఎంత పాలిష్ చేసినా ఈ బండ అద్దం అయ్యేటట్లు లేదు" అన్నారు గురువుగారు.

"అవునవును- బాగా చెప్పారు. బాసింపట్లు వేసుకొని ఎంత కూర్చున్నా బుద్ధుడు అవ్వలేరు ఎవ్వరున్నూ" అని శిష్యుడు అంతర్థానం అయిపోయాడు.

ఆ క్షణంలోనే గురువుగారి ప్రజ్ఞ మేలుకొన్నదట!



# వంకాయ తప్పు

*మూలం: పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ టు లివ్ బై.* *తెలుగు అనుసరణ: నారాయణ, కొత్తపల్లి బృందం.*



నానక్ చంద్ గారు పండితులు, ఊళ్లో ఉన్న గుడులలో అతి పెద్ద గుడికి పూజారి. ఊర్లో ఆయనకంటూ అభిమానులు చాలా మందే ఉండేవాళ్ళు. ప్రతిరోజూ ఉదయం , సాయంత్రం ఆయన గుళ్లో ప్రవచనాలు చేసేవాడు, ఆయన ధార్మిక ప్రసంగాలు వినేందుకు జనాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే వాళ్లు. ఆ ప్రసంగాలకు ఆయన భార్య లక్ష్మి ప్రతి రోజు వచ్చేది కాదు గానీ, అప్పుడప్పుడూ వస్తూండేది.

ఒకరోజు సాయంత్రపు సభకు ఆమెకూడా హాజరైంది. ఆ రోజున పండితుల వారు భగవద్గీత ఆరో అధ్యాయం వివరిస్తున్నారు. గీతలో కృష్ణుడు అర్జునుడికి చెబుతున్నాడు, 'మనసుని ఏకాగ్రం చేసేదెట్లాగ, దాన్ని అదుపులో ఉంచుకునేదెట్లాగ ' అని. "మనసుని అదుపు చేసుకుంటే తప్ప, మనం నిత్య జీవితంలో ఎదురయ్యే మామూలు పనుల్ని కూడా చెయ్యలేము" అని, పండితుల వారు ఏవేవో క్లిష్టమైన శాస్త్ర విషయాలు చెప్పసాగారు.

చెప్తూ చెప్తూ ఆయన యథాలాపంగా మామూలు విషయాలు ముచ్చటించటం మొదలు పెట్టారు: "ఉదాహరణకు, వంకాయనే

తీసుకోండి, దాని రంగు ఎలా ఉంటుందో చూడండి." అన్నారాయన. "ఊదారంగు మచ్చలు- కానీ నలుపు తిరిగి ! ఒక్కోసారి పూర్తి నలుపు! చూస్తే నిజంగానే చాలా వెగటు పుట్టించే కాయ అది! ఇక దాని రుచి? వగరు! దాదాపు చేదు! దాన్ని హిందీలో 'బైంగన్' అంటారు. దాని మూలం 'బేగుణ్'- 'ఎలాంటి మంచి గుణాలూ లేనిది' అని దాని అర్థం! నిజంగానే ఆయుర్వేదం ప్రకారం వంకాయలో మనిషికి హాని చేసే గుణాలున్నై గాని, మంచి గుణం ఒక్కటీ లేదు. వంకాయ పై పరిశోధనలు చేసి, దానిలో మనకు హాని చేసేవి ఏవీ లేవని తేలితే తప్ప, నిజానికి మనం ఎవ్వరమూ వంకాయను తిననే కూడదు! ఇవన్నీ కాదంటే కూడాను, వంకాయలు పరమ ఖరీదు! చవకగా దొరకనే దొరకవు! ఇక ఎవరైనా అలాంటి కూరగాయ మీద డబ్బులు ఎందుకు వృథా చేసుకోవాలి?" అని ఇదే ధోరణిలో ఒక పది నిముషాలు మాట్లాడారు.

ఈ మాటలు వింటున్న లక్ష్మికి కంగారు ఎక్కువైంది. ఆ రోజు రాత్రి తినేందుకని ఆమె ఇంట్లో వంకాయకూరే చేసి పెట్టి వచ్చింది మరి! అందుకని, నానక్‌చంద్ గారి ప్రసంగం పూర్తయ్యే లోగానే ఆవిడ లేచి, నిశ్శబ్దంగా బయటపడి, నేరుగా ఇంటికి పోయింది. వండి పెట్టిన వంకాయ కూరనంతా చెత్తకుప్పలో పడేశాక, 'త్వరగా అయ్యే వంటకం ఏముందా' అని ఆలోచించి, ఆమె వేడి వేడి పెసర గంజి చేసి పెట్టింది, హడావిడిగా.

ఇక పండితుల వారు ప్రసంగం ముగించి ఆకలిగా ఇంటికొచ్చి చూస్తే, తినేందుకు గంజి తప్ప మరేమీ లేదు!

"ఇదేమిటి? 'రాత్రి భోజనానికి ఇలా గంజి ఒక్కటే చాలు ' అని నీకెవరు చెప్పారు? ఈ రోజు ప్రొద్దున్నే నేను కొన్ని మంచి వంకాయలు తెచ్చాను కదా? వాటినైనా వండి ఉండవచ్చునే?" అన్నారాయన భార్యతో.



"నేను వాటినే వండానండీ! వంకాయ కూరే చేసిపెట్టి వచ్చాను- మీ ప్రసంగం వినేందుకు! అయితే మీరు వంకాయ గురించి చెప్పినవన్నీ విన్నాక, 'ఇక వాటిని తినరేమో' అనిపించి, ఆ కూరనంతా ఎత్తి చెత్తకుప్పలో పడేసాను. కొత్తగా ఈ గంజిని వండాను మళ్లీ!" అన్నదామె, సంజాయిషీ ఇచ్చుకుంటూ.

"అయ్యో! ఎంతపని చేశావు! వినటం రాకపోతే ఇట్లాగే ఉంటుంది! ఉపన్యాసం మధ్యలో

ఇక ఏం చెప్పాలో గుర్తు రాక, వంకాయ గురించి మొదలు పెట్టాను. ఎంత ఆలోచించినా తర్వాతి శ్లోకం గుర్తురాలేదు మరి- ఏం చెయ్యను? అందుకని వంకాయ మీద యుద్ధాన్ని కొనసాగించేశాను! ఇన్నేళ్ళ కాపురం తర్వాతకూడా నన్ను అర్థం చేసుకోకపోతే ఎలాగ? ఉపన్యాసాన్ని *నువ్వు ఈ చెవిలోంచి విని, ఆ చెవిలోంచి వదిలెయ్యాలి- నిజానికి ఉపన్యాసాలు వినేవాళ్ళంతా చేసేది ఆ పనే కదా, అంతమాత్రం తెలీదా?"* అని బాధ పడ్డారు పండితులవారు- చెత్తకుప్పలోకి అన్యాయంగా చేరుకున్న వంకాయకూరను తలచుకుంటూ.

**జోకులు**

**ఫిక్సింగ్!**

రోహిత్: అదేమిట్రా హాల్లో పట్టుమని పది మంది ప్రేక్షకులు లేరు- మరి క్లయిమాక్సులో ఈ చప్పట్లు, ఈలలు మోతలు ఎక్కడవిరా?!

వినోద్: మరేం అవన్నీ....... బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ లో చప్పట్లు, ఈలలు వెరైటిగా ఉంటుందని మిక్స్ చేశానురా, బాగున్నె కదూ?

**బద్ధకం**

టీచర్: రామూ! " వాయిదా వేయడం " అంటే ఏంటో చెప్పు!

రాము: ఈ ప్రశ్నకు సమాధానం "రేపు చెబుతా" టీచర్.

*సేకరణ: జయదుర్గ*

.

# అమ్మకన్న

*గానం*: M. *జగన్‌సంప్రీత్*, M. *సాయిసంకీర్తు*, (8 *వతరగతి*), M.*శృతి- విజయవాడ.*
*రచన: శ్రీవారణాసివెంకట్రావు, విజయవాడ*



అమ్మకన్న అవనిలో దైవమెవ్వరు?
అమ్మకన్న సృష్టికే మూలమెవ్వరు?

పలుకలేని పశువులైన
పిలువనేర్చు 'అమ్మా' యని
పాలు లేని పక్షులైన పెంచనేర్చు తమ పిల్లల-
గుండెలోన క్రూరత్వం గూడుగట్టు మృగానికి
సృష్టిలోన సహజమగును మాతృత్వపు మమకారం
"అమ్మకన్న అవనిలో"




ఆటు పోటు తగులుచుండు సప్తసముద్రాలకైన
తరుగుచుండు పెరుగుచుండు రవిచంద్రుల తేజమైన
ఆదినుండి తరగనిది అమ్మప్రేమ ఒక్కటే (2)
"అమ్మకన్న అవనిలో"

ఉన్ననాడు లేనినాడు కన్నతీపి ఒక్కటే
అయోగ్యుడైన యోగ్యుడైన ఆదరణ ఒక్కటే
ఉన్న కనులు రెండైనా పాపకొక్క రెప్ప అమ్మ (2) "అమ్మకన్న అవనిలో"

# నందామయా



*సేకరణ, గానం: అభ్యాస విద్యాలయం బాలలు, విజయవాడ.*

నందామయా గురుడ నందామయా
ఆనంద దేవికి నందామయా (2)

బంజర్లు పేదలకు పంచుతామని చెప్పి
భూస్వాములకే కట్టబెట్టారయ్యా (2)
"నందామయా"

అన్నపూర్ణవంటి ఆంధ్రభూమిని నేడు
బియ్యానికే కరువు పెంచారయా
"నందామయా"

బ్యాంకుల్లో డబ్బంతా పేదోల్లకని చెప్పి
కొసకు నెత్తిన చెయ్యి పెట్టారయ్యా
"నందామయా"

కలవోల్ల లాభాలు పొలికలగా హెచ్చించి
పేదోల్లపై పన్ను పెంచారయ్యా
"నందామయా"

దేశసేవకె తాము దిగివచ్చినామంటూ
గోటు దాసరిపాట పాడారయా
"నందామయా"

మన వోట్లతో వాల్లు మంత్రిదాకా వచ్చి
కుచ్చుటోపీ ప్రజలకు పెట్టారయా
"నందామయా"

కొత్తపల్లి పత్రికలోని ఈ పాటల్ని మీరు ఇంటర్నెట్లో http://kottapalli.in వద్ద ఉచితంగా వినచ్చు, ఉచితంగా డౌన్లోడు చేసుకోవచ్చు కూడాను!



# వన్నెల చిన్నెల పాపలము

*గానం: విద్యార్థి సృజన కుటీర్ బాలలు, విజయవాడ.*

వన్నెల చిన్నెల పాపలము
కమ్మని పలుకుల చిలుకలము
తీయని ముద్దుల మూటలము
తరగని మీగడ తరగలము

"చదువు సంధ్యలు మా హక్కు
మనో వికాసం మా హక్కు
తిండీబట్టలు మా హక్కు
దేహారోగ్యం మాహక్కు
అది మా హక్కు ఇది మా హక్కు"

అని పెద్దలు అంటుంటారు -
ఆందోళన చేస్తుంటారు
మా హక్కుల మాటేమంటారు? "వన్నెల చిన్నెల "


మాలో ఝాన్సీలున్నారు
మాలో రుద్రమలున్నారు
మాలో రాయలలున్నారు
మాలో గాంధీలున్నారు
మాలో సుభాషులున్నారు
మాలో జవహరులున్నారు
ఎవరిలో ఎవరు ఉన్నారో
మీరే పెద్దలు వెతకండి "వన్నెల చిన్నెల"



కార్యశూరులు కన్నమ దాసులు
బాల చంద్రులు బొబ్బిలి వీరులు
తానాజీలు శివాజీలు అప్పాజీలు రాజాజీలు
విశ్వకవీంద్రులు విశ్వేశ్వరయ్యలు
విశ్వమందు శాశ్వతులు
వీరందరు బాలలె ఒకనాడు
వారిలా అవుతాం మరునాడు "వన్నెల చిన్నెల"

# చిలిపి ప్రశ్నలు- అల్లరి జవాబులు

*సేకరణ: శ్రీ. వి.వి.యస్.మూర్తిగారు, చొదిమెళ్ళ, 534002, పశ్చిమగోదావరి జిల్లా.*
*కార్టూన్లు: 'విద్యార్థి' కృష్ణ, విజయవాడ.*



సమయస్ఫూర్తిగల ఉల్లి వ్యాపారి ఎవరు?

"పది కేజీలు ఉల్లిపాయలు కొన్నవారికి ఒక కర్చీఫ్ ఉచితం" అని ప్రకటన ఇచ్చేవాడు!





బ్యాంక్ మ్యానేజర్ బుర్ర గోక్కునేదెప్పుడు?

బ్యాంక్ కొనుక్కోటానికి లోన్ కావాలని కస్టమర్ అడిగినప్పుడు!

తెలివైన టపాకాయల వ్యాపారిఏమని ప్రకటించాడు?

"రిమోట్ తో పేల్చే దీపావళి బాంబులు మా ప్రత్యేకత!" అన్నాడు.






మిమిక్రీ ఆర్టిస్టు మొహం ఎప్పుడు మాడిపోయింది?

"కుక్కను పెంచుకుందాం" అని తన భార్యతో అంటే,

"మీరు ఉండగా అదెందుకులెండి" అని ఆవిడ అన్నప్పుడు!

"జగన్నాటకం" అనే సీరియల్ చూస్తున్న ప్రేక్షకులు నోళ్ళెప్పుడు వెళ్ళబెడతారు?

టైటిల్సులో "కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం- 'భగవంతుడు' " అని కనబడ్డప్పుడు!






"కోటి విద్యలు కూటికొరకే" సామెత పాతదైపోయింది.. మరి కొత్తదేమిటి?

"కోటి విద్యలు కోటి కొరకే"

వాతావరణశాఖ అధికారి కొడుకుని మేస్టారు హోంవర్కు అడిగితే ఏమన్నాడు?

"ఇంట్లో వాతావరణం బాగాలేక, చెయ్యలేదు సార్" అన్నాడు!






నిద్రపోతున్న హోం మినిస్టర్ ఉలిక్కిపడి నిద్రలేచేదెప్పుడు?

దేవుడు కలలో కనబడి 'నాగుడికి సెక్యూరిటీ పెంచు' అని ఆదేశించినప్పుడు!

# చెత్త!

*నిర్వహణ*: G.*లలిత*, telugu4kids.com

ఈ బొమ్మను చూస్తే మీకేమనిపిస్తున్నది?



అబ్బ! ఏం చెత్తరా బాబూ! ఎక్కడెక్కడి చెత్తా మన దగ్గరికే గదా, చేరుకునేది? ఆ చెత్తలోని క్రిములు, రసాయనాలు, అన్నీ మనలోకే చేరుకుంటున్నై! చెత్తని తయారు చేసేదీ మనమే, దాన్ని అసహ్యించుకునేదీ మనమే, చివరికి ఏమీ అనలేక దాన్ని స్వీకరించేదీ మనమే! ఈ చెత్తను చూస్తే ఏదేదో చెప్పాలని అనిపిస్తోంది గదూ? ఏదైనా చక్కని కథ మనసుకు తట్టిందా? అయితే వెంటనే చెప్పెయ్యండి! ఆ కథను వీలైనంత తొందరగా మాకు పంపించండి. బాగున్న కథలను కొత్తపల్లి కథల పుస్తకం ముప్ఫైఆరో భాగంలో ప్రచురిస్తాం.

మా చిరునామా: కొత్తపల్లి బృందం, 2-312, చెన్నేకొత్తపల్లి - 515 101,
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

(ఇ-మెయిలు: team@kottapalli.in)

# కొత్తపల్లి -ఒక పరిచయం

పూర్వం ఒక రాజుగారికి ఉన్న నలుగురు కొడుకులూ అప్రయోజకులయ్యారట. బహుశ: తండ్రిగారి క్రమశిక్షణ మరీ ఎక్కువైపోయిందేమో, వాళ్లకి ఏం చెప్పినా అర్థం కావట్లేదు. తల్లిదండ్రులూ, అమాత్యులూ, గురువులూ ఏం చెప్పాలని నోరు తెరిచినా వాళ్ల చెవులు మూసుకుపోతున్నాయి. తెలివి తేటలకేమీ తక్కువ లేదు. ఉన్నదల్లా అప్రయోజకత్వమే.

చివరికి రాజుగారు విష్ణుశర్మ అనే పండితుడిని రావించి, ఆయన్ని గౌరవించి, తన కొడుకుల్ని చూపించి, "వాళ్లని మీరే తీర్చిదిద్దాలని వేడుకున్నారు. విష్ణుశర్మ సరేనని వాళ్లని వెంటబెట్టుకెళ్ళారు. ఆరు నెలల్లో వాళ్లు నలుగురూ ప్రయోజకులై తిరిగి వచ్చారు!

విష్ణుశర్మ వాళ్లమీద వ్యాకరణ శాస్త్రాలనూ, వేదమంత్రాలనూ, క్షత్రియోచిత యుద్ధ విద్యల్నీ రుద్దలేదు. పుస్తకాలు ముందు పడేసి చదవకపోతే ఊరుకోనని ఉరమలేదు. కథలు చెబుతూ పోయాడు. ఆ కథలే రాజుగారి కొడుకుల్ని ప్రయోజకుల్ని చేశాయి. నీతి చంద్రికగానూ, పంచతంత్రంగానూ పేరొందాయి.

కథలు, ఆటలు, పాటలు వృధాపోవు. వాటిలో పిల్లలకు వాళ్లదైన ఒక ప్రపంచం దొరుకుతుంది. ఆ ప్రపంచంలో స్వేచ్ఛగా రెక్కలల్లార్చుకుంటూ తిరిగి, వాళ్లు ఇతర ప్రాపంచిక విషయాల్ని సునాయాసంగా నేర్చుకుంటారు.

తెలుగు పిల్లలకు సంతోషాన్ని ఇచ్చేందుకుగాను మానవీయ స్పర్శ ఉన్న కథల్ని, ఆటపాటల్ని , విద్యా, విజ్ఞాన, వినోదాల్నీ పిల్లల స్వీయ దృక్పథంలో, బేషరతుగా అందించే ఉద్దేశంతో, దాదాపు మూడేళ్ళ క్రితం "కొత్త పల్లి" మీ ముందు నిల్చింది.

కొత్తపల్లిని ఇంటర్నెట్లో సందర్శించటం చాలా సులభం. కొత్తపల్లిలో ప్రచురితమయ్యే పాటల్ని మీరు అక్కడ వినచ్చు, ఉచితంగా డౌన్లోడు చేసుకోవచ్చు కూడాను! కొత్తపల్లి పత్రిక పాత సంచికల్ని కూడా పిడియఫ్ ఫైళ్లుగా దిగుమతి చేసుకొని, తీరికగా చదువుకోవచ్చు; అవసరం అనుకుంటే సొంతగా ముద్రించుకోవచ్చు !

ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నా, లేకున్నా, "కథల్ని పుస్తకాలుగా చదువుకోవటం బాగుంటుంది" అనుకునే వాళ్ళకోసం కొత్తపల్లి కథల పుస్తకం ఏనెలకానెల ముద్రింప బడుతోంది. అదే ఉంది, ప్రస్తుతం మీ చేతుల్లో!

బాగా చదవండి, చదివి వినిపించండి, చదివించండి, చెప్పించి పలికించండి, రాయించి పంపండి, సంతోషంగా ఉండండి!

**వెల:**

ప్రతి ఒక్కింటికి: 20 రూ.

12 భాగాలు: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోను: 08559 240222

ఇ-మెయిలు: team@kottapalli.in

**ఈ నెలలో ఏపని-ఎవరిది?**

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

ముఖచిత్రం: వీరాంజనేయులు

బొమ్మలు: అడవిరాముడు, శివప్రసాద్, ప్రసాద్, వెంకట్, చంద్రకాంత్, మహేశ్, గణేశ్, గోపి, జిలాని, జాహ్నవి, వై.రాజు.

కార్టూన్లు: 'విద్యార్థి' కృష్ణ

బొమ్మకు కథ: లలిత, telugu4kids

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

**ప్రత్యేక కృతజ్ఞతలు:**

'అదే నేనైతేనా' ఆదిలక్ష్మిగారికి, 'చిలిపి ప్రశ్నల' మూర్తి గారికి, ప్రకృతి బడికి, టింబక్టు బడికి, అరవింద స్కూలుకు, అభ్యాస విద్యాలయానికి, విద్యార్థి సృజన కుటీరానికి, నందన గ్రామీణ పాఠశాలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు,గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.

# కథల కథ

అనగా అనగా ఒక చిన్న కథ తయారైంది.  గెంతుకుంటూ, ఆడుకుంటూ పోతోంది ఆకాశంలో.  అంతలో దానికొక రామచిలుక ఎదురైంది.

"చిట్టి కథా, చిట్టి కథా! నువ్వు భలే కనిపిస్తున్నావు. నేను నిన్ను తీసుకుంటాను, ప్లీజ్!" అన్నదది.

"తీసుకో, తీసుకో! దాందేముంది? నేనున్నదే అందరికోసం!" అన్నది చిన్న కథ.

రామచిలుక చిట్టి కథను తీసుకోగానే కథలు రెండైనై! చిలకేమో ఒక కథను పట్టుకొని ఎగురుకుంటూ పోయింది- బిగ్గరగా అరుచుకుంటూ.

ఇంకో కథ తన దారిన తను పోతూ ఉంటే చిన్నారి పాప ఒకతె ఎదురైంది దానికి, ఓ చెట్టుకొమ్మను పట్టుకొని.

"ఏం, చిన్నారీ! ఎటు పోతున్నావు, ఒక్కతెవే? మీ అమ్మేది?" అంది కథ.

"అమ్మ పోయి కొమ్మ వచ్చె ఢాం ఢాం ఢాం!" అని నవ్వింది పాప.  కథకి పాపను చూస్తే ముచ్చట వేసింది.

అది పాపతో కలిసి పోయి, వాళ్ళ అమ్మనీ, అమ్మమ్మనీ, నాన్ననీ అందర్నీ చుట్టుకొని వచ్చింది.

రామచిలుక అక్కడ అరచుకొంటూ పోతుంటే మొద్దురాముడు ఎదురయ్యాడు దానికి: "ఏయ్! చిలకా! భలే కథ ఉన్నట్లుందే, నీ దగ్గర? నాకూ చెప్పు! వింటాను!" అన్నాడు వాడు.

"ఊరికే వింటే ఏం లాభం? రాయాలి! నీకు చేతులున్నై కద!" అంది చిలుక.

"ఊహ్! ఓహ్! అయ్యో! రాయటం రాదే!" మూలిగాడు వాడు.

"కుదరదు నాన్నా! నన్ను అందుకుంటే రాయాల్సిందే!" అన్నది కథ.  "సరే" అని వాడు రాయటం నేర్చుకున్నాడు.

ఈ సారి ఒక్క కథే పది కథలైంది- ఎవరెవరినో చేరింది.  అందరికీ చదవటం నేర్పింది.

ఆ కథని చదివిన పిల్లలెవ్వరూ దాన్ని ఆపుకోలేదు- అందరి దగ్గరా అది రెండింతలు అవుతూనే పోయింది.  ఆ పిల్లల స్నేహితులు- వాళ్ళ అమ్మా నాన్నలు- వాళ్ళ స్నేహితులు- ఇట్లా పోతూనే ఉంది కథ- అందరూ విన్నారు; అందరూ చదివారు; అందరూ చెప్పారు!

చాలా ఏళ్ళ తర్వాత మాకు చెప్పిందొక పాప, ఆ కథని- "ఓయ్, కథా! రా! నిన్ను కొత్తపల్లిలో వేస్తాం" అన్నాం మేం.

"మా బాగా వేసుకోండి! నేనున్నదే అందరికోసం!" అన్నది కథ.

"సరేగానీ, నిన్నెవరు తయారు చేశారు, మొదట?" అడిగాం, మేం, పెద్దవాళ్ళం.

"అయ్యో! నేను ఎన్ని చోట్ల తిరిగాను, ఎంత మారాను! ఎప్పుడో ఒక రామచిలుక పాడింది నన్ను! ఒక మొద్దు రాముడు రాశాడు నన్ను! కానీ ఎందరు పిల్లలు బ్రతికించారో, ఏం చెప్పను? ఎంతమంది పెద్దలు మెచ్చి కాపాడారో, ఏమనను? మీరేమైనా మొదటివాళ్ళా? మీపని మీరు కానివ్వండి! నా దారిన నేను ఎగురుతూనే ఉంటాను" అని నవ్వింది కథ.

ఇదీ, ఈ కథల కథ!

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada, Phone:08662579129

మంచి పుస్తకం:

## ఆటల సరదాలో

పిల్లలు ఊరికే కూర్చోరు. ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. అనేక విషయాలను స్వయంగాచేసి తెలుసుకుంటూ ఉంటారు వాళ్ళు.

అనేక సందర్భాల్లో చిన్న చిన్న వస్తువులే పిల్లలకు ఎనలేని అనందాన్ని తెచ్చిపెడుతుంటాయి. మామూలు అగ్గిపెట్టె కూడా పిల్లల కల్పనాశక్తి స్పర్శతో 'ఇంద్రజాల పేటిక'గా మారిపోతుంది. సాధారణమైన అగ్గిపెట్టే, పిల్లల్ని చేరే సరికి గిలక, హుండీ, రైలుపెట్టె, పడవ, భూగృహం- ఇట్లా అనేక రూపాలను సంతరించుకుంటుంది. పిల్లలు సేకరించుకొని భద్రంగా దాచుకొనే వస్తువుల్లో షూ పాలిష్ డబ్బాలు, రకరకాల మూతలు, అగ్గిపుల్లలు, ఖాళీ రీఫిళ్ళు, గుండీలు, గాజుముక్కలు, బ్యాటరీలు, కొవ్వొత్తులు ఇంకా పెద్దలకు అంతగా ఇష్టంకాని వస్తువులు అనేకం ఉంటై.

ఇవన్నీ, నిజానికి విజ్ఞాన సాధనాలే! బొమ్మల పెట్టెలో పిల్లలు దాచుకునే ఈ వస్తువుల్తో అనేక ప్రయోగాలు చెయ్యచ్చు! భౌతిక శాస్త్రపు మౌలిక విషయాల్ని ఆడుతూ పాడుతూ అర్థం చేసుకునేందుకు ఇవి ముడిసరుకులు!

ఈ ముడిసరుకులకు ప్రాణం పోసి సజీవ ప్రయోగాలుగాను, ఆటలగాను మలచి చూపిస్తుంది, అరవింద గుప్తా గారి పుస్తకం-- "ఆటల సరదాలో". ఈ పుస్తకం చదివి, తమ దగ్గరున్న 'చెత్త' వస్తువులతో ఏమేం చెయ్యచ్చో చూశాక, ఇక పిల్లలు ఊరుకోరు- శాస్త్రవేత్తల అవతారం ఎత్తక మానరు.

ప్రతి ఇంట్లోనూ ఉంచుకోవాల్సిన చిన్న పుస్తకం-

"ఆటల సరదాలో"

రచన: అరవింద గుప్తా

ప్రచురణ: జనవిజ్ఞాన వేదిక

పేజీలు: 48, వెల: 20 రూపాయలు.

